తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | గురువారం-02- అక్టోబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 127 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# మళ్లీ సమ్మె దిశగా ప్రైవేట్ కళాశాలలు


- ఈనెల 12 వరకు ప్రభుత్వానికి డెడ్‌లైన్
- ప్రభుత్వం ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో సమ్మె దిశగా కళాశాలలు
- 13 నుంచి సమ్మెకు వెళ్లాలని నిర్ణయం
- విద్యార్థులతో కలిసి ఛలో హైదరాబాద్ చేపడతామని హెచ్చరిక



**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)**

ప్రభుత్వం ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో ప్రైవేట్ కళాశాలల మళ్లీ సమ్మె బాట పట్టనున్నాయి. ఇవాళ అత్యవసర సమావేశం నిర్వహించిన ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ప్రభుత్వ వైఖరిపై మీడియా సమావేశం ఏర్పాటు చేశాయి. ఎఫ్ఏటీహెచ్ఐ ఛైర్మన్ రమేశ్ మాట్లాడుతూ ప్రభుత్వానికి విద్యారంగం ఆఖరి ప్రాధాన్యతగా ఉందని ఆరోపించారు.

మిగతా 2లో




# ఐ బొమ్మపై పోలీసుల దృష్టి

- సంచలన ప్రకటన విడుదల చేసిన పైరసీ వెబ్‌సైట్
- సినిమా, ఓటీటీ పైరసీ కేసులో సైబర్‌క్రైమ్ పోలీసుల దర్యాప్తు
- ఓటీటీ కంటెంట్ తస్కరిస్తూ నిర్వాహకులకు తలనొప్పిగా మారిన ఐబొమ్మ

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)**

సినిమా, ఓటీటీ పైరసీ కేసులో హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇటీవల థియేటర్‌లో రికార్డ్ చేసే వారితో పాటు సర్వర్లు హ్యాక్ చేస్తున్న ప్రధాన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. దర్యాప్తు క్రమంలో ఐబొమ్మ వెబ్‌సైట్‌పై దృష్టి పెట్టడంతో దాని నిర్వాహకులు పోలీసులకు సవాల్ విసిరారు. దానిని ఛాలెంజింగ్‌గా తీసుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు ఆ వెబ్‌సైట్ కోసం పని చేస్తున్న నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఉత్తర్‌ప్రదేశ్, బిహార్‌లలో ఐబొమ్మకు ఏజెంట్లు ఉన్నట్లు గుర్తించారు. మరోవైపు ఓటీటీ కంటెంట్‌ను తస్కరిస్తూ నిర్వాహకులకు తలనొప్పిగా మారడంతో ఐబొమ్మని కట్టడి చేసేందుకు విచారణ వేగవంతం చేశారు. ఈ క్రమంలో ఆ పైరసీ వెబ్‌సైట్ నుంచి ఓ ప్రకటన వచ్చిందటూ సోషల్ మీడియాలో వేదికగా వైరల్‌గా మారింది.

మిగతా 2లో

# ఆర్టీసీ ప్రయాణికులకు దసరా లక్కీ డ్రా


- టికెట్‌తో పేరు, ఫోన్ నంబరు నమోదు చేసి బహుమతులు గెలుచుకునే అవకాశం
- బతుకమ్మ, దసరా కోసం 7,754 ప్రత్యేక బస్సు సర్వీసులు
- అదనపు ఛార్జీలు వర్తింపు

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)**

ఆర్టీసీ (రోడ్డు రవాణా సంస్థ) ప్రయాణికులకు మరింత దగ్గరయ్యేందుకు సరికొత్త ఆలోచనలతో ముందుకు దూసుకెళ్తోంది. పండగ వేళల్లో ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి, ప్రయాణికులను ప్రైవేటు ట్రావెల్స్‌కు వెళ్లకుండా ఉండేందుకు దసరా లక్కీ డ్రా పేరుతో బంపర్ ఆఫర్‌ను ప్రకటించింది. ఇంచుమించు ప్రైవేటు ట్రావెల్స్‌కు తగ్గకుండా పండగ సీజన్లో టికెట్లపై డిస్కౌంట్లు ఇస్తోంది. ఈ లక్కీ డ్రా సెప్టెంబరు 27న ప్రారంభమైంది. అక్టోబర్ 6వ తేదీ వరకు ఈ ఆఫర్ నడవనుంది. దీనికి గాను ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 11 డిపోలకు చెందిన బస్సుల్లో ప్రయాణించేవారు తాము తీసుకున్న టికెట్‌పై పేరు, ఫోను నంబరు, చిరునామా రాసి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన డబ్బాలో వేయాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలోని 11 డిపోలకు చెందిన బస్సుల్లో రోజుకు సాధారణ రోజుల్లో 4.5 లక్షల నుంచి 5 లక్షల వరకు ప్రయాణిస్తారు.

మిగతా 2లో



పాఠకులు, ప్రకటనకర్తలు, మిత్రులు, శ్రేయోభిలాషులకు

దసరా శుభాకాంక్షలు

దసరా పండుగ సందర్భంగా గురువారం తెలంగాణ ముచ్చట్లు ఆఫీసులకు సెలవు. కావున శుక్రవారం సంచిక వెలువడదు కావున శనివారం మళ్లీ కలుద్దాం.

# విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


- తెలంగాణ సాంస్కృతిక ఐక్యతకు దసరా పండుగ ప్రాధాన్యం
- కొడంగల్ పర్యటనకు ముందు బాపూఘాట్‌లో గాంధీజీకి నివాళి అర్పించనున్న సీఎం



**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)**

విజయదశమి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక జీవన విధానంలో దసరాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా దసరా సంబరాలు చేసుకుంటున్నామని తెలిపారు. తెలంగాణ సబ్బండ వర్గాల ఐక్యతకు నిదర్శనంగా ఈ పండుగ నిలుస్తుందని రేవంత్ తెలిపారు.

మిగతా 2లో



# భార్య భోజనం పెట్టలేదని కరెంట్ స్తంభం ఎక్కిన భర్త

- మద్యం మత్తులో హల్చల్ చేసిన వ్యక్తి
- విద్యుత్ సరఫరా నిలిపేసి కాపాడిన స్థానికులు

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)**

నిజామాబాద్ జిల్లాలో ఓ విచిత్ర సంఘటన చోటు చేసుకుంది. భార్య మీద అలిగిన ఓ భర్త, ఏకంగా కరెంట్ స్తంభం ఎక్కి హల్చల్ చేశాడు. సుమారు రెండు గంటల పాటు స్థానికులను, పోలీసులను ముప్పుతిప్పలు పెట్టాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన సిరికొండ మండలంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే, సిరికొండ మండలం కోమన్ పల్లి గ్రామానికి చెందిన సుమన్ అనే వ్యక్తికి, అతని భార్యకు మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో భార్య అతనికి భోజనం పెట్టేందుకు నిరాకరించింది. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన సుమన్, మద్యం సేవించి గ్రామ శివార్లలోని ఓ విద్యుత్ స్తంభం ఎక్కాడు.

మిగతా 2లో

# రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్

- ఏనాటికైనా ధర్మానిదే విజయమనే స్ఫూర్తిని దసరా అందిస్తోంది
- తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో బతుకమ్మతో పాటు విజయ దశమి స్ఫూర్తి ఇమిడి ఉన్నది
- బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్



**హైదరాబాద్** : రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఓటమి నుంచి రాష్ట్ర ప్రజల జీవితాలు గెలుపు దిశగా పయనించాలి అని కేసీఆర్ ఆకాంక్షించారు. తొమ్మిది రోజుల బతుకమ్మ సంబురాలతో పాటు, దేవీ శరన్నవరాత్రుల దుర్గమ్మ పూజల పర్వదినాలకు కొనసాగింపుగా.. విజయ దశమిగా జరుపుకునే దసరా

మిగతా 2లో



# బీసీ రిజర్వేషన్ల బిల్లుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

- రెండు నెలలు ఆగి ఎన్నికలు పెడితే వచ్చే నష్టమేంటని ప్రశ్న
- కోర్టులను ఈటల తప్పదోవ పట్టిస్తున్నారని విమర్శ
- మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రంగా ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసమే తమ పోరాటమని ఆమె స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ...

మిగతా 2లో

# కేసీఆర్ పాలన రైతులకు స్వర్ణయుగం

- 2014 నుంచి పదేళ్ల కాలంలో రైతుల బలవన్మరణాలు తగ్గాయి
- కేసీఆర్ రైతుబంధు పాలన రైతులకు స్వర్ణయుగమనే విషయం మరోమారు రుజువైంది
- 2014 నుంచి 2023 మధ్య తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయ
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



2లో




# నకిలీ వార్తల ప్రచారం, వ్యక్తిత్వ హననం చేస్తే కఠిన చర్యలు

- తెలంగాణ 6వ డీజీపీగా బీ. శివధర్ రెడ్డి
- స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఏర్పాటు చేస్తాం

2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక



## విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన సీఎం రేవంత్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ఈ(మొదటి పేజీ తరువాయి)

మరోవైపు గురువారం ఉదయం ముఖ్యమంత్రి బాపూ ఘాట్‌ను సందర్శించి గాంధీజీకి నివాళి అర్పించనున్నారు.

**సీఎం కొడంగల్ పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు**

విజయదశమి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో నిర్వహించే దసరా ఉత్సవాల్లో పాల్గొంటారు. అక్కడి నుంచి గురువారం రాత్రి కొడంగల్‌కు బయలుదేరి తన నివాసంలో బస చేయనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, అడిషనల్ కలెక్టర్ అమరేందర్ కొండారెడ్డిపల్లి గ్రామాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

# మళ్లీ సమ్మె దిశగా ప్రైవేట్ కళాశాలలు

(మొదటి పేజీ తరువాయి)

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వ విడుదల చేయలేదని, గత నెల 21, 22 తేదీల్లో రూ.600 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ ఇచ్చినా బకాయిలు చెల్లించలేదని, రూ.200 కోట్లు నిధులు మాత్రమే విడుదల చేశారని తెలిపారు. దీపావళి పండగలోపు రూ.1,200 కోట్లు ఇస్తామన్నారని, ఎలా ఇస్తారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. ఈ నెల 12లోపు బకాయిలు చెల్లించకుంటే 13 నుంచి సమ్మెకు వెళ్తామని స్పష్టం చేశారు. ఇవాళ్టి నుంచి సీఎంవో కార్యాలయంతో తప్ప మరెవరితో చర్చించమని, అవసరం అయితే విద్యార్థులతో కలిసి ఛలో హైదరాబాద్ చేపడతామని ఆయన హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విద్యారంగం ఆఖరి ప్రాధాన్యతగా ఉంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రభుత్వ విడుదల చేయలేదు. గత నెల 21, 22 తేదీల్లో రూ.600 కోట్లు ఇస్తామని హామీ ఇచ్చారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ ఇచ్చినా బకాయిలు చెల్లించలేదు. రూ.200 కోట్లు నిధులు మాత్రమే విడుదల చేశారు. దీపావళిలోపు రూ.1,200 కోట్లు ఇస్తామని అన్నారు ఎలా ఇస్తారో చెప్పాలి. ఈ నెల 12లోపు బకాయిలు చెల్లించకుంటే 13 నుంచి సమ్మెకు వెళ్తాం. ఇవాళ్టి నుంచి సీఎంవో కార్యాలయంతో తప్ప మరెవరితో చర్చించం. అవసరం అయితే విద్యార్థులతో కలిసి ఛలో హైదరాబాద్ చేపడతాం.'' రమేశ్, ఎఫ్ఏటీహెచ్ఐ చైర్మన్



రాష్ట్ర ప్రభుత్వం కాలేజీలకు విడుదల చేయవలసిన బకాయిల మొత్తం రూ.1,200 కోట్లకు పైగా ఉందని గతంలో ఎఫ్ఏటీహెచ్ఐ పేర్కొంది. బకాయిలు చెల్లించాలని కోరుతూ సెప్టెంబర్ 15 తరగతుల బంద్??కు ప్రకటించాయి. ఈ ప్రతిపాదనకు రాష్ట్రంలోని కొన్ని కాలేజీలు మద్దతు పలికాయి. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వం, కాలేజీ యాజమాన్యాలతో చర్చలు జరిపింది.

ఆ సమయంలో తెలంగాణలోని వృత్తి విద్యా కళాశాలల యాజమాన్యాలతో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలం అయ్యాయి. దీపావళిలోగా రూ.1200 కోట్ల బకాయిలు విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ఒక ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఫీజురీయింబర్స్‌మెంట్ అంశంపై మంత్రులు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులతో జరిపిన చర్చలు విజయవంతమైనట్లు అప్పుడు ప్రకటించాయి. చర్చలు సఫలం కావడంతో తరగతుల బంద్‌ను ఉపసంహరించుకున్నట్లు వృత్తి విద్యా కళాశాలల యాజమాన్యాలు తెలిపాయి. కానీ బకాయిలు పూర్తిగా రాకపోవడంతో మళ్లీ యాజమాన్యాలు ఆందోళనకు సిద్ధమయ్యాయి.

# ఆర్టీసీ ప్రయాణికులకు దసరా లక్కీ డ్రా

(మొదటి పేజీ తరువాయి)

పండగ వేళల్లో 6 లక్షల వరకు ప్రయాణికులు బస్సుల్లో గమ్యస్థానాలకు చేరుకుంటారు. వారిని ఆకర్షించేందుకు ఏర్పాటు చేసిన లక్కీ డ్రా స్కీంతో మరింతమంది పెరిగే అవకాశముంటుంది. లక్కీడ్రా లో మొదటి బహుమతి గెలుచుకున్నవారికి రూ.25 వేలు చెల్లించనుంది. రెండో బహుమతికి రూ.15 వేలు, మూడో బహుమతి కింద రూ.10 వేలు అందించనున్నారు. ఆర్టీసీకి చెందిన హైఎండ్ బస్సులు సెమీ డీలక్స్, మెట్రో డీలక్స్, డీలక్స్,



సూపర్ లగ్జరీ, లహరి నాన్‌ఏసీ, ఏసీ బస్సుల్లో ప్రయాణించిన వారు మాత్రమే ఈ లక్కీ డ్రాలో పాల్గొనేందుకు అర్హులు. ఆర్టీసీ బస్సు సర్వీసుల్లో ప్రయాణం పూర్తయిన తర్వాత వారి టికెట్‌పై తమ పూర్తి పేరు, ఫోన్ నంబరు స్పష్టంగా రాయాలి. ఆ తర్వాత టికెట్‌ను బస్ స్టేషన్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక డ్రాప్ బాక్స్‌లలో వేయాలి. ఆర్టీసీ సంస్థ ప్రతి రీజియన్‌కు ముగ్గురు చొప్పున మొత్తం 11 రీజియన్‌ల నుంచి 33 మంది విజేతలను ఎంపిక చేస్తుంది. కరీంనగర్ రీజియన్ కార్యాలయంలో ఈ నెల 8న సాయంత్రం 4 గంటలకు తీసే డ్రాలో ముగ్గురు విజేతలను ప్రకటిస్తారు. బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించడానికి టీజీఎస్ ఆర్టీసీ స్పెషల్ బస్ సర్వీసులు ఏర్పాటు చేసింది. ఈ మేరకు 7,754 స్పెషల్ బస్సులు నడుపుతోంది. గత దసరా కంటే ఈ సారి రద్దీకి తగ్గట్లుగా అదనంగా 617 బస్సు సర్వీసులను ఏర్పాటు చేసింది. ఈ నెల 20వ తేదీ నుంచి అక్టోబరు 2 వరకు ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. అక్టోబరు 5,6 తేదీల్లో తిరుగు ప్రయాణం కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఈ బస్సుల్లో అదనంగా 50 శాతం వరకు అదనపు ఛార్జీలను వసూలు చేయనున్నట్లు ఆర్టీసీ యాజమాన్యం ఇప్పటికే స్పష్టం చేసింది.

## ఐ బొమ్మపై పోలీసుల దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

సినిమా పరిశ్రమకు పెను సవాల్‌గా మారిన పైరసీ ముఠాను సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. దేశంలోనే అతి పెద్దదైన ముఠాను ఛేదించి ఆరుగురిని అరెస్టు చేశారు. తెలుగు సహా పలు భాషల సినిమాలను పైరసీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. దీని ద్వారా సినిమా ఇండస్ట్రీకి దాదాపు రూ.3,700 కోట్లు నష్టం జరిగిందని పోలీసులు తెలిపారు.

గతంలో హ్యాష్ ట్యాగ్ సింగిల్ సినిమా పైరసీపై పోలీసులకు కంప్లైంట్ అందింది. దీనిపై విచారణ చేపట్టి నిందితుడిని జులై 3న రంగారెడ్డి జిల్లా వనస్థలిపురంనకు చెందిన కిరణ్‌ను అరెస్టు చేశారు. అతడిని కస్టడీలోకి తీసుకుని విచారించగా, ఆ పైరసీ ముఠా సభ్యులు నెదర్లాండ్, దుబాయ్, మయన్మార్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఈటీవీ విన్ కంటెంట్‌ను పైరసీ చేసి అమ్ముకున్న మరో నిందితుడిని అరెస్టు చేశారు. ఇలా రికార్డ్ చేసి ఒరిజినల్ కంటెంట్‌ను తీసుకుని ఇతర వెబ్‌సైట్లకు ముఠా విక్రయిస్తోంది. థియేటర్లలో ప్లే అయ్యే శాటిలైట్ కంటెంట్ ఐడీ, పాస్‌వర్డ్‌లను సైతం నేరగాళ్లు క్రాక్ చేస్తున్నారు. కొన్ని సార్లు క్రాక్ అవ్వని పక్షంలో ఏజెంట్లకు కెమెరాలు అందజేసి, రహస్యంగా రికార్డు చేయడాన్ని నేర్పిస్తున్నారు. అనంతరం ఆ ఏజెంట్లకు టికెట్లు బుక్ చేసి మరీ థియేటర్లలో సినిమాలు రికార్డ్ చేస్తున్నారు. చొక్కా జేబు, పాప్ కాన్ డబ్బా, కోక్ టిన్‌లలో కెమెరాలు పెట్టి చిత్రీకరిస్తున్నారు. ఏజెంట్లకు క్రిప్టో కరెన్సీ రూపంలో నిందితులు కమీషన్లు ఇస్తున్నారు. కేవలం తెలుగు సినిమాలే కాదు, తమిళ్, మళయాళం, హిందీ సినిమాలపై నేరగాళ్లు ప్రత్యేక దృష్టి పెట్టారు.

## రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపిన కేసీఆర్

(మొదటి పేజీ తరువాయి)

పండుగకు తెలంగాణ ప్రజా జీవనంలో ప్రత్యేక స్థానం ఉన్నదని కేసీఆర్ అన్నారు కార్యధీక్షులను అపజయాల నుంచి విజయాల దిశగా నడిపిస్తూ, ఏనాటికైనా ధర్మానిదే అసలు విజయం అనే స్ఫూర్తిని దసరా పండుగ మనకు అందిస్తుందని కేసీఆర్ తెలిపారు. దసరా పండుగ విశిష్టతను గౌరవిస్తూ, జమ్మి చెట్టును రాష్ట్ర వృక్షంగా, పాలపిట్టను రాష్ట్ర పక్షిగా, నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించిందని ఈ సందర్భంగా కేసీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో బతుకమ్మతో పాటు విజయ దశమి స్ఫూర్తి ఇమిడి ఉన్నదని, అదే స్ఫూర్తితో పదేండ్ల పాలనలో ప్రజలను ప్రగతి విజయాల దిశగా నడిపించామన్నారు. ఓటమి నుంచి రాష్ట్ర ప్రజల జీవితాలు గెలుపు దిశగా పయనించాలని కేసీఆర్ ఆకాంక్షించారు. తాము ఎంచుకున్న లక్ష్యాలను చేరుకుని, నిత్య శుభాలతో ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు నిండేలా దీవించాలని దుర్గా మాతను కేసీఆర్ ప్రార్థించారు.



## బీసీ రిజర్వేషన్ల బిల్లుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

(మొదటి పేజీ తరువాయి)

బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందే వరకు కేవలం రెండు నెలలు ఆగి ఎన్నికలు నిర్వహిస్తే ప్రభుత్వానికి వచ్చే నష్టమేంటని ఆమె ప్రశ్నించారు. ఒకవైపు జీవో ఇచ్చి, మరోవైపు తమ అనుచరులతోనే కోర్టులో కేసు వేయించారని, ఈ విషయం సోషల్ మీడియాలో కూడా చర్చనీయాంశమైందని ఆమె వ్యాఖ్యానించారు. గ్రామాల్లో లేని సామాజికవర్గాలకు కూడా రిజర్వేషన్లు కేటాయించడం గందరగోళానికి దారితీస్తోందని అన్నారు. ప్రభుత్వం చేపట్టిన కులగణన వివరాలను బయటపెడితే రిజర్వేషన్ల కేటాయింపులో స్పష్టత వస్తుందని కవిత సూచించారు. ఇదే సమయంలో, స్థానిక ఎన్నికలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలపైనా కవిత తీవ్రంగా స్పందించారు. న్యాయస్థానాలను తప్పుదోవ పట్టించేలా ఈటల మాట్లాడుతున్నారని, ఆయన వ్యాఖ్యలు సొంతమా లేక పార్టీవి చెప్పించారా అని నిలదీశారు. ఈ వ్యాఖ్యల పట్ల ఈటల రాజేందర్ బీసీ సమాజానికి



బేషరతుగా క్షమాపణ చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. మరోవైపు, రేవంత్ రెడ్డి ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహ రూపురేఖలను మార్చి గెజిట్ విడుదల చేసిందని ఆరోపించారు. అయితే, బతుకమ్మ నిమజ్జన కార్యక్రమంలో సీఎం పాల్గొనడాన్ని ఆమె స్వాగతించారు. ఈ సందర్భంగా, తనకు బీఆర్ఎస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని కవిత స్పష్టం చేయడం గమనార్హం.

## భార్య భోజనం పెట్టలేదని కరెంట్ స్తంభం ఎక్కిన భర్త

(మొదటి పేజీ తరువాయి)

ఇది గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

స్తంభంపైకి ఎక్కిన సుమన్ కిందకు దిగేందుకు నిరాకరించాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఎంత బతిమాలినా వినలేదు. పైకి రావడానికి ప్రయత్నిస్తే దూకేస్తానని బెదిరించడంతో అంతా ఆందోళనకు గురయ్యారు. దాదాపు రెండు గంటల పాటు ఈ హైడ్రామా కొనసాగింది. పరిస్థితి చేయి దాటిపోతుండటంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. చివరకు పోలీసులు రంగప్రవేశం చేసి, అతనికి నచ్చజెప్పి సురక్షితంగా కిందకు దించారు. దీంతో అతని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

## నకిలీ వార్తల ప్రచారం, వ్యక్తిత్వ హననం చేస్తే కఠిన చర్యలు

**హైదరాబాద్:** తెలంగాణ 6వ డీజీపీగా బీ. శివధర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. లక్డీకపూల్‌లోని డీజీపీ కార్యాలయంలో ఉన్న తన చాంబర్‌లో ప్రత్యేక పూజల అనంతరం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా జరిగేందుకు ఏర్పాటు చేస్తామన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను త్వరగా భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతామని చెప్పారు. బేసిక్ పోలీసింగ్ సహాయంతో సమర్థంగా విధులు నిర్వహిస్తామని చెప్పారు. క్షేత్రస్థాయిలో సాంకేతికతను వినియోగించుకుంటామన్నారు. పోరాట మార్గం వీడేందుకు సిద్ధమని నక్సల్స్ నేత ఇటీవల లేఖ రాశారని, జనజీవన స్రవంతిలో కలవాలని మావోయిస్టులను కోరుతున్నామని చెప్పారు. లొంగిపోయిన నక్సల్స్‌కు అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సమాజాభివృద్ధిలో భాగం కావాలని మావోయిస్టులను కోరారు. పీఎస్‌ల సంఖ్య కంటే పోలీసుల్లో నైపుణ్యాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడిరచారు. పోలీసు శాఖ ప్రత్యేక విభాగాల్లోని ఖాళీలను నిపుణులతో భర్తీ చేస్తామన్నారు. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు చేసేవారు అప్రమత్తంగా ఉండాలని, నకిలీ వార్తల ప్రచారం, వ్యక్తిత్వ హననం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## కేసీఆర్ పాలన రైతులకు స్వర్ణయుగం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణలో 2014 నుంచి పదేళ్ల కాలంలో రైతుల బలవన్మరణాలు తగ్గాయన్న జాతీయ నేర గణాంక విభాగం నివేదికపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. తన అధికారిక సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్ ద్వారా స్పందన తెలియజేశారు. కేసీఆర్ రైతుబంధు పాలన రైతులకు స్వర్ణయుగమనే విషయం మరోమారు రుజువైందని ఆయన పేర్కొన్నారు. అప్పటి ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, ప్రాజెక్టులవల్ల 2014 నుంచి 2023 మధ్య తెలంగాణలో రైతుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయని కేంద్ర ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయని తెలిపారు. 2014లో తెలంగాణలో రైతులు, కౌలుదారులు, రైతు కూలీల ఆత్మహత్యల సంఖ్య 1,347గా ఉన్నదని, అదే 2023లో ఆ ఆత్మహత్యల సంఖ్య 56కు తగ్గిందని కేటీఆర్ చెప్పారు. అంటే 96 శాతం తగ్గుదల నమోదైందని అన్నారు. దేశంలోని రైతుల ఆత్మహత్యల్లో తెలంగాణ వాటా 2014లో 10.9 శాతం ఉంటే.. 2023 నాటికి అది 0.51 శాతం తగ్గిందని తెలిపారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పరిస్థితి తారుమారైందని విమర్శించారు. రెండేళ్లలోనే 700 మందికిపైగా అన్నదాతల ఆత్మహత్యలు నమోదయ్యాయని ఆందోళన వ్యక్తంచేశారు.





## వరంగల్‌లో సీజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్ కోసం భవనాల పరిశీలన

**◆ సెంటర్ మంజూరుతో నెరవేరిన కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్ల దశాబ్దాల కల**

**హనుమకొండ,అక్టోబర్01 (తెలంగాణ ముచ్చట్లు):**

వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య సీజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు భవనాల ఎంపికలో ముందడుగు వేశారు. బుధవారం ఆమె స్వయంగా హనుమకొండలోని కుడా కార్యాలయం, కాజీపేట డివిజన్ మున్సిపల్ కార్యాలయం, డీఎంహెచ్‌ఓ కార్యాలయంలను పరిశీలించారు.ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ సహా అధికారులు పాల్గొని భవనాలపై పూర్తి వివరాలను ఎంపీకి అందించారు.

కడియం కావ్య మాట్లాడుతూ, వరంగల్‌లో వెల్‌నెస్ సెంటర్ మంజూరు కావడం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల ఎన్నో ఏళ్ల ఆశయ సాధన అని పేర్కొన్నారు. తగిన భవనాన్ని త్వరగా ఖరారు చేసి, సెంటర్ ప్రారంభం కోసం చర్యలు వేగవంతం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సెంటర్ ద్వారా ఉద్యోగులు, పెన్షనర్లకు స్థానికంగానే నాణ్యమైన వైద్యసేవలు అందుతాయని తెలిపారు.

తరువాత హనుమకొండ కనుకదుర్గ కాలనీలోని ఎంపీ నివాసంలో కేంద్ర ఉద్యోగులు, పెన్షనర్లు కడియం కావ్యను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వెల్‌నెస్ సెంటర్ మంజూరుకు ఆమె చేసిన కృషి, వెంటనే భవనాల పరిశీలన చేపట్టిన తీరు పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
గురువారం-02- అక్టోబర్ 2025





# ఫైర్‌స్టేషన్ ముందు రోడ్డుపై ప్రజలు ఫైర్

## ఆర్‌అండ్‌బి శాఖ నిర్లక్ష్యం... ప్రమాదంలో ప్రజల ప్రాణాలు!

**స్టేషన్ ఘనపూర్, అక్టోబర్ 01 తెలంగాణ ముచ్చట్లు**

స్టేషన్‌ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లి ఫైర్‌స్టేషన్ ముందు ప్రధాన రహదారి రెండు భారీ గుంతలతో ప్రమాదకరంగా మారింది. భారీ వాహనాలు వస్తే అంతే అటున వాహనం అక్కడ ఆగాలి ఇంకో వాహనం పోయేంతవరకు ఎదురు చూడాల్సిందే
ప్రతిరోజూ వందల సంఖ్యలో వాహనాలు ప్రయాణించే ఈ రహదారి ఇలా నిర్లక్ష్యానికి గురవ్వడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**పండుగల రద్దీలో తీవ్ర ప్రమాదం**

ప్రస్తుతం తెలంగాణ అంతటా బతుకమ్మ, దసరా పండుగల సందడి నడుస్తోంది.
ఈ సందర్భంగా పాలకుర్తి, కొడకండ్ల, తిరుమలగిరి వంటి ప్రాంతాలకు అర్ధగంటకో బస్సు నడుస్తోంది.
దీనికితోడు రోజూ వందల లారీలు, ట్రక్కులు, ఆటోలు, ప్రైవేట్ వాహనాలు ఈ మార్గాన్నే వాడుతున్నాయి.
ఈ రద్దీ సమయంలో గుంతలు వాహనదారుల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
"ప్రతి సంవత్సరం కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నామని అధికారులు చెబుతారు... కానీ రోడ్డు మాత్రం గుంతల మయం అవుతోంది. ఇది ప్రజల ప్రాణాలతో ఆటలాడటమే" అని ప్రయాణికులు మండిపడుతున్నారు.

**"ప్రజల ప్రాణాలు పణంగా..." స్థానికుల ఆగ్రహం**

స్థానికులు మాట్లాడుతూ –
"ఇది ప్రధాన రహదారి... అయినా ఆర్‌అండ్‌బి శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. చిన్నపాటి మరమ్మతులకైనా చర్యలు తీసుకోవడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?" అని ప్రశ్నిస్తున్నారు.
"రోజూ స్కూల్ బస్సులు, పాలు తీసుకెళ్లే వాహనాలు, పండుగల కోసం వెళ్తున్న కుటుంబాలు ఈ మార్గంలో ప్రయాణిస్తున్నాయి. చిన్నపిల్లలతో కూడిన వాహనాలు కూడా ఇక్కడ దూసుకుపోతుంటాయి. ఒకవేళ ప్రమాదం జరిగితే ఎవరూ మాపై కనికరం చూపరు" అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**"ప్రభుత్వం, అధికారులు తక్షణం స్పందించాలి"**

ప్రజల ప్రాణాలకు ముప్పు తెచ్చే ఈ గుంతలను వెంటనే భర్తీ చేసి రహదారిని సురక్షితంగా మార్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.
"ఇంత రద్దీగా ఉండే రహదారి కాబట్టి అధికారులు మరింత శ్రద్ధ పెట్టాలి. ప్రజలు బతుకమ్మ పాటలు పాడుకుంటూ ఆనందంగా పండుగ జరుపుకోవాల్సిన వేళ, గుంతలతో భయాందోళనలో ప్రయాణం చేస్తున్నారు. ఇది ఏ విధమైన పరిపాలన?" అని విమర్శించారు.

**"చర్యలు లేకపోతే ఆందోళనలు తప్పవు"**

"ప్రజల సమస్యల పట్ల ఆర్‌అండ్‌బి శాఖకు కనీస బాధ్యతా భావం లేకుండా పోయింది. గుంతలు పూడ్చకపోతే రహదారిపైనే ఆందోళనలు చేపట్టక తప్పదు" అని స్థానికులు హెచ్చరించారు.
ప్రజలు ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నిస్తూ –
"మా ప్రాణాలకు హామీ ఎవరు ఇస్తారు? రోడ్డు బాగుచేయకపోతే అధికారుల నిర్లక్ష్యంపై మేమే పోరాటం చేస్తాం" అని స్పష్టం చేస్తున్నారు.





# నాగారం మున్సిపాలిటీలో వాహన పూజలు

- **మున్సిపల్ కమిషనర్ ఎస్. భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం**

**నాగారం, అక్టోబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**

నాగారం మున్సిపాలిటీ పరిధిలో వాహన పూజలు ఘనంగా నిర్వహించబడ్డాయి. మున్సిపాలిటీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని వార్డు కార్యాలయాల్లో మున్సిపల్ కమిషనర్ ఎస్. భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రజల సేవలో నిరంతరంగా వినియోగంలో ఉండే వాహనాల భద్రత, సకాలంలో సేవలందించాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం వాహన పూజలు నిర్వహించడం పరంపరగా కొనసాగుతున్నదని తెలిపారు.
కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంతోష్ కుమార్, మేనేజర్ సురేష్ రెడ్డి, రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు, టౌన్ ప్లానింగ్ ఇన్‌చార్జ్ తిరుపతి రెడ్డి, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ శ్రీదేవి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సాయిరాజ్, శానిటేషన్ విభాగం నుండి ప్రదీప్, ఏ. బాబు తదితరులు పాల్గొన్నారు.అదేవిధంగా 20 వార్డుల వార్డు అధికారులు, మున్సిపాలిటీ సిబ్బంది మరియు పరిశుభ్రత సిబ్బంది ఈ వాహన పూజల్లో పాల్గొని విజయవంతం చేశారు.




# ఎ ఎ ఫర్నిచర్ టౌన్ షోరూం ప్రారంభం

- **ఎంపీ ఈటెల రాజేందర్, ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**కుషాయిగూడ, అక్టోబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడలో అత్యాధునిక సదుపాయాలతో కొత్తగా నిర్మించబడిన ఎ ఎ ఫర్నిచర్ టౌన్ షోరూం బుధవారం ప్రజల ఆరాధన మధ్య ఘనంగా ప్రారంభమైంది.
ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి యాదవ్, సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై, శుభారంభం చేశారు. రిబ్బన్ కట్ చేసి, షోరూం లోని విభాగాలను పరిశీలించారు.
నాణ్యత – వినియోగదారుల విశ్వాసం ఈ సందర్భంగా ప్రొప్రైటర్ జలంధర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు ఉత్తమ నాణ్యతతో కూడిన ఫర్నిచర్‌ను అందించడం తమ ముఖ్య లక్ష్యమని తెలిపారు. ఆధునిక డిజైన్లు, కొత్త మోడల్‌స్‌తో కస్టమర్లకు మరింత సంతృప్తి కలిగించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని అన్నారు.ముఖ్య అతిథులు మాట్లాడుతూ :ఆధునిక కాలంలో ఇళ్ల అందాన్ని పెంచడంలో ఫర్నిచర్ కీలక పాత్ర పోషిస్తోందని, హైదరాబాదులో వేగంగా పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని కుషాయిగూడలో ఇంత పెద్ద షోరూం ప్రారంభమవడం స్థానికులకు ఒక వరం అని పేర్కొన్నారు.నాణ్యమైన ఫర్నిచర్‌ను అందుబాటు ధరలకు అందించడం అభినందనీయం అని, త్వరలోనే ఫర్నిచర్ టౌన్ హైదరాబాద్‌లో ప్రముఖ ఫర్నిచర్ డెస్టినేషన్‌గా నిలుస్తుందని అన్నారు.
విభిన్న ఉత్పత్తులు – ప్రత్యేక ఆఫర్లు:షోరూంలో సోఫా సెట్లు, డైనింగ్ టేబుల్స్, బెడ్ సెట్లు, ఆఫీస్ ఫర్నిచర్, మాడ్యులర్ కిచెన్ సదుపాయాలు తదితర విభాగాలను ఏర్పాటు చేశారు. కస్టమర్ల కోసం ప్రత్యేక రాయితీలు ప్రకటించారు.
ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, కాసం మహిపాల్ రెడ్డి, శివకుమార్ గౌడ్, మహేష్ గౌడ్, కే. సీతారాం రెడ్డి, ఎంపల్లి పద్మరెడ్డి, మర్రి మోహన్ రెడ్డి, కనుకుల రజినీకాంత్ రెడ్డి, సపిడి శ్రీనివాస్ రెడ్డి, నాదం, చల్ల ప్రభాకర్, రమేష్ యాదవ్, గోపాల్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్ తదితరులు, వివిధ పార్టీ నాయకులు, కాలనీ వాసులు పాల్గొని షోరూం ప్రారంభోత్సవాన్ని ఘనవిజయం చేశారు.

# ఉప్పల్ నియోజకవర్గ ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు

**ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి , కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్**



**చిల్కానగర్, అక్టోబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి మరియు చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ఉప్పల్ నియోజకవర్గ ప్రజలందరికీ, ముఖ్యంగా చిల్కానగర్ డివిజన్ వాసులందరికీ విజయదశమి (దసరా) పండుగ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయ దశమి అనేది చీకటి పై వెలుగుకి, చెడుపై మంచికి, అసత్యం పై సత్యానికి జయగర్జన. ప్రజలందరూ ఈ పండుగను కుటుంబ సభ్యులు, పిల్లా పాపల తో ఆనందంగా, అంగరంగ వైభవంగా జరుపుకోవాలని కోరుకుంటున్నాము. అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని మనసారా ప్రార్థిస్తున్నాము" అని అన్నారు.

# వనపర్తి ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు

- **జిల్లెల్ల ఆదిత్య రెడ్డి ఏఐసీసీ నేషనల్ హెడ్ (హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్)**

**వనపర్తి,అక్టోబర్01(తెలంగాణ ముచ్చట్లు):**




వనపర్తి నియోజకవర్గ యువ నాయకుడు, ఏఐసిసి నేషనల్ హెడ్ (హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్) డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి విజయదశమి పర్వదినాన్ని పురస్కరించి వనపర్తి జిల్లా ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.
చెడుపై మంచి సాధించిన విజయాన్ని ప్రతీకగా తీసుకొని, ఈ పర్వదినం ప్రతి ఇంటికీ ఆనందం, శ్రేయస్సు నింపాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరి జీవితంలో అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరుతూ, ప్రజల కోసం ప్రగతి, సుఖసంతోషాలను కోరారు.
తెలంగాణలో దసరాకు ఉన్న సాంస్కృతిక ప్రాధాన్యతను గుర్తిస్తూ, ఇది విజయానికి చిహ్నం అని ఆయన పేర్కొన్నారు. దుర్గాదేవి ఆశీర్వాదంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే ప్రతి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమం విజయవంతమై, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలనే ఆకాంక్షతో డాక్టర్ ఆదిత్య రెడ్డి పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

# కేంద్రీయ విద్యాలయం మంజూరు... జాతీయ స్థాయిలో గుర్తింపు పొందనున్న వనపర్తి

- **వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘా రెడ్డి**

**వనపర్తి,అక్టోబర్01(తెలంగాణ ముచ్చట్లు):**



వనపర్తి జిల్లా నేడు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందనుంది. కేంద్ర క్యాబినెట్ ఆమోదంతో వనపర్తి జిల్లా కేంద్రానికి కేంద్రీయ విద్యాలయం మంజూరు చేయడం గర్వించదగిన ఘట్టమని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి తెలిపారు.
ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రయత్నాలు ఫలించడంతో, కేంద్ర ప్రభుత్వం అభ్యర్థనకు స్పందిస్తూ వనపర్తికి కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేసింది.
ఈ ఘట్టాన్ని సాధించడంలో కేంద్ర ప్రభుత్వానికి, అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
కేంద్రీయ విద్యాలయం మంజూరుకు సహకరించిన ఇన్చార్జి మంత్రివర్యులు దామోదర రాజనర్సింహ, జిల్లా మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు మల్లురవి, మరియు జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభికు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.భవిష్యత్తులో జాతీయ స్థాయిలో విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందుతుందనే ఉత్సాహంతో ప్రజల్లో ఆశాభావం నెలకొంది.

# తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు నిలయం సద్దుల బతుకమ్మ

**మల్కాజ్గిరి, అక్టోబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**

సద్దుల బతుకమ్మ పండుగను పురస్కరించుకొని గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని గోపాల్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గోపాల్ నగర్ కాలనీలో సద్దుల బతుకమ్మ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి సతీమణి మర్రి మమతారెడ్డి, గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవులు హాజరై మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ పాడుతూ పాల్గొన్నారు.తరువాత ప్రసంగించిన మర్రి మమతారెడ్డి మాట్లాడుతూ "బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక. ఈ పండుగను మహిళలు ఎంతో ఉత్సాహంగా, ఐక్యతతో జరుపుకోవడం రాష్ట్ర ప్రత్యేకత" అని పేర్కొన్నారు.
కార్యక్రమంలో గోపాల్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, మహిళలు, స్థానికులు ఉత్సాహంగా పాల్గొని పండుగ వాతావరణాన్ని మరింత అందంగా తీర్చిదిద్దారు.



తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## సామాజిక ఉద్యమకారునికి ఎల్ పి సి కార్మికుల ఆర్థిక సహాయం

**హసన్ పర్తి, అక్టోబర్ 01(తెలంగాణ ముచ్చట్లు):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 65వ డివిజన్ ఎల్లాపూర్ గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు రేణు కుంట్ల దుర్గాప్రసాద్ మాదిగ గత నెలరోజులుగా గుండెపోటు తో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం కోలుకోవడానికి ఎల్ పి సి కార్మికులంతా కలసి ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు వెలిసొజు రమణాచారి మాట్లాడుతూ గతంలో కార్మికుల కోసం ఎన్నో పోరాటాలు చేశారని అదే విదంగా ఈఎస్ఐ కూడా సాధించిపెట్టారని కార్మిక నాయకుడిగా మూతబడ్డ ఫ్యాక్టరీని తెరవడానికి కృషి చేశారాని కార్మికుల కోసం ఎన్నో పోరాట చేశారని అన్నారు .ఈ కార్యక్రమంలో ఎర్ర సురేందర్. గోపరాజు సాయిలు,తంగేడు పెల్లి తిరుపతి,నార్ల గిరి బిక్షపతి,ఇల్లందుల రమేష్, బరిసా ఐలయ్య,కల్వచర్ల సుదర్శన్ పాల్గొన్నారు.

---

## తెలుగు ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర మంత్రి తుమ్మల

**సత్తుపల్లి, అక్టోబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** తెలుగు ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అభిలషించారు.



"చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ దసరా పండుగను అందరూ ఆనందంగా, ఐకమత్యంతో జరుపుకోవాలి. ప్రజలందరికీ విజయం, ఐశ్వర్యం కలగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.
రాష్ట్ర రైతుల సంక్షేమం కోసం పలు పథకాలు అమలు చేస్తున్నట్లు ఆయన గుర్తు చేశారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీలు, విత్తనాలు, ఎరువులు, పంట బీమా, మార్కెట్ సదుపాయాలు అందిస్తూ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు.
అంతేకాకుండా, రాష్ట్రంలో సాగు నీటి వనరుల అభివృద్ధి, కాలువల మరమ్మతులు, చెరువుల పునరుద్ధరణ వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. రైతు కుటుంబాల అభ్యున్నతే తమ ముఖ్య లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

---



## అత్తులూరి రంగారెడ్డి ఆరోగ్యంపై ఆరా తీసిన మంత్రి తుమ్మల

**కల్లూరు, అక్టోబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో తనతో పాటు నడిచిన శిష్యుడు, కల్లూరు మాజీ ఎంపీపీ అత్తులూరి రంగారెడ్డి ఆరోగ్య పరిస్థితిని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర రావు బుధవారం పరామర్శించారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న రంగారెడ్డి నివాసానికి వెళ్లి ఆయనను ఆప్యాయంగా పలకరించి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. మంత్రి వెంట స్థానిక శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమై దయానంద్, నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలు, తుమ్మల అభిమానులతో పాటు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షులు భాగం నీరాజ, చలసాని సాంబశివరావు, చల్లగుల్ల నరసింహారావు ఉన్నారు.

---




## నాగలి గుండ లో మహా అన్నదానం

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 1, తెలంగాణ ముచ్చట్లు:** చింతకాని మండలం నాగిలిగొండ గ్రామ రామాలయం వద్ద బుధవారం దుర్గా దేవి నవరాత్రులు సందర్భంగా కమిటీ సభ్యులు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ అన్నదాన కార్యక్రమంలో గ్రామ ప్రజలందరూ కులమతాలు అతీతంగా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు అని కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ అన్నదాన కార్యక్రమానికి సహకరించిన వారందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.





# కల్లూరు, మల్సూర్ తండాలో ఘనంగా నవరాత్రులు

- **పూజలు, అన్నప్రసాదాల్లో పాల్గొన్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే రాగమయి.**

**సత్తుపల్లి, అక్టోబరు 1 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి నియోజకవర్గంలోని కల్లూరు పట్టణం, తల్లాడ మండలం మల్సూర్ తండాలో దసరా నవరాత్రులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రత్యేక పూజల్లో పాల్గొని భక్తులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు.
కల్లూరులో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన పూజలు, అనంతరం జరిగిన అన్నప్రసాదంలో పాల్గొన్న నేతలు భక్తులకు ఆశీస్సులు అందజేశారు. అలాగే పుల్లయ్య బంజర్ రహదారి వద్ద జరిగిన నవరాత్రి ఉత్సవాల్లోనూ వీరు హాజరయ్యారు.
తరువాత తల్లాడ మండలం మల్సూర్ తండాలో నిర్వహించిన నవరాత్రి పూజల్లో పాల్గొన్న మంత్రి తుమ్మల నాగేశ్వరావు, ఎమ్మెల్యే రాగమయి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కల్లూరు ఏఎంసీ అధ్యక్షుడు భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, ఖమ్మం జిల్లా ఆర్యవైశ్యుల అధ్యక్షుడు పసుమర్తి చంద్రరావు, తల్లాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాపా సుధాకర్, స్థానిక కాంగ్రెస్ నాయకులు, మహిళలు, యువత, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

---






# రానున్న స్థానిక ఎన్నికలకు బీఆర్ఎస్ సన్నద్ధం కావాలి

- **అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేయాలని పిలుపు**

**సత్తుపల్లి, అక్టోబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** రానున్న స్థానిక ఎన్నికలకు బీఆర్ఎస్ నాయకత్వం తక్షణమే సన్నద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య సూచించారు. సత్తుపల్లి క్యాంపు కార్యాలయంలో రూరల్ మండల బీఆర్ఎస్ నాయకులతో ఆయన సమావేశమై మాట్లాడారు.
కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని, ఆ అంశాన్ని ప్రజలకు అవగాహన కల్పించేలా గ్రామస్థాయిలో ప్రచారం నిర్వహించాలని ఆయన అన్నారు. స్థానిక ఎన్నికల నిర్వహణపై సమగ్ర చర్చలు జరిపి, అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేసి గ్రామ స్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.
ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ కూసంపూడి రామారావు, దొడ్డ శంకర్రావు, శీలపరెడ్డి హరికృష్ణ రెడ్డి, బొడ్డు శివబాబు, వాసిరెడ్డి నాగయ్య, నాగబత్తిని చంటి, క్యామ శ్యాంసన్, మోటపూతుల నాగేశ్వర రావు, తుంబూరు దామోదర్ రెడ్డి, కాలినేని వెంకటేశ్వరరావు, కొప్పుల అప్పారావు, కొడిమెళ్ళ అప్పారావు, పురుషోత్తం, వాడే కృష్ణారావు, మోదుగు పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

---





# అంగరంగ వైభవంగా దేవి నవరాత్రి ఉత్సవాలు

- **ఉత్సాహంగా సాగిన సాంస్కృతిక, భజన కార్యక్రమాలు**
- **లక్కీ డ్రాలో స్కూటీ, మొబైల్ బహుమతులు**

**చర్లపల్లి, అక్టోబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** దసరా పండుగను పురస్కరించుకొని చర్లపల్లి డివిజన్ కుషాయిగూడ పరిధిలోని ఇందిరానగర్, ద్వారకాపురి, మీనాక్షి నగర్, ఎంఆర్ఆర్ కాలనీ, లక్ష్మీ నరసింహ స్వామి కాలనీ, మధుర నగర్ కాలనీలు సంయుక్తంగా జై దుర్గ భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఆర్గనైజర్ విజయ్ కుమార్ సమక్షంలో 11వ సంవత్సర దేవి నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయంత్రం భక్తులకు అల్పాహారం వడ్డిస్తున్నారు. మహిళలు రాత్రి వరకు అమ్మవారిని కొలిచి సద్దుల బతుకమ్మ వేడుకను కూడా ఘనంగా జరిపారు.
మంగళవారం రాత్రి సాంస్కృతిక, భజన కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి.ఆర్గనైజర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ యువతి, యువకులు ఎంతో ఉత్సాహంగా భవాని దీక్ష మాల ధరించి, నియమ నిష్టలతో పూజలు నిర్వహించడం ఆనందదాయకం.యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా, ఆధ్యాత్మిక దారిలో ముందుకు సాగాలని ఆకాంక్ష. గత 11 సంవత్సరాలుగా ఆరు కాలనీల పెద్దలు, ప్రజలు అందరూ సహకరించడంతో ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈసారి లక్కీ డ్రాలో స్కూటీ, మొబైల్ బహుమతులు ఏర్పాటు చేసి, దసరా రోజున డ్రా తీయనున్నారు.
దసరా పండుగ ప్రాముఖ్యత
దసరా, బతుకమ్మ పండుగలు తెలంగాణ రాష్ట్రంలో మహా ఉత్సవాలుగా జరుపుకుంటారని, చెడుపై మంచి గెలిచిన సందర్భంలో దసరా పండుగ విశిష్టతను గుర్తుచేశారు .ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నవారు కమిటీ సభ్యులు రాజశేఖర్ రెడ్డి, ఎస్. రాహుల్, యశ్వంత్, నాగేందర్, ఎస్. అరుణ్, కిషోర్, బాల, కే. ప్రసాద్, లింగం నాయక్, సంజయ్, దినేష్, భవాని దీక్ష మాలదారులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

---





# అశ్వారావుపేటలో అంతర్జాతీయ రక్తదాన దినోత్సవం ఘనంగా..!

**అశ్వారావుపేట, అక్టోబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** అశ్వారావుపేట మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా ఘనంగా రక్తదాన శిబిరం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ హాజరై రక్తదానంలో పాల్గొన్నవారిని అభినందించారు.
ఎమ్మెల్యే మాట్లాడుతూ, రక్తదానం అత్యంత విలువైన సేవ, మనం ఇచ్చే ఒక్క యూనిట్ రక్తం ఒక ప్రాణాన్ని కాపాడుతుంది. ప్రతి ఆరోగ్యవంతుడు సమయానికి రక్తదానం చేస్తే అనేక ప్రాణాలు రక్షించబడతాయి అని అన్నారు.
లయన్స్ క్లబ్‌లో గతంలో విశిష్ట సేవలు అందించిన పెద్దలను ఘనంగా సన్మానించారు. అలాగే, పిల్లల కోసం ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ పార్క్ ను ప్రారంభించి చిన్నారులు ఆనందంగా ఆడే వాతావరణాన్ని సృష్టించారు.
ఈ కార్యక్రమంలో మా కమిటీ చైర్మన్ సుంకపల్లి వీరభద్ర రావు, మండల అధ్యక్షులు తుమ్మా రాంబాబు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు నరేంద్ర, లయన్స్ సభ్యులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.




# అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే తుడి మెగా రెడ్డి

**వనపర్తి,అక్టోబర్01(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి శాసనసభ్యులు తుడి మెగా రెడ్డి బుధవారం పెద్దమందడి మండలం మణిగిల, పెద్దమందడి, అల్వాల గ్రామాలలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో, మొదట మణిగిల్ల గ్రామంలోని దళిత వాడలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాన్ని సందర్శించి దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత శివాలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.పెద్దమందడి మండల కేంద్రంలోని శ్రీ చెన్నకేశవ ఆలయంలో ప్రతిష్ఠించబడిన దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అల్వాల గ్రామాల ఆలయంలో ప్రతిష్ఠించబడిన అమ్మవారికి కూడా ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామకృష్ణ, మాజీ జడ్పిటిసి వెంకటస్వామి, మణిగిల్ల గ్రామ నాయకులు తిరుపతిరెడ్డి, అల్వాల సుదర్శన్ రెడ్డి, మద్దిలేటి, సురేష్, నరసింహ రెడ్డి, వెంకయ్య, చావ్వ రాములు, అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# ఉప్పల్, చిలకనగర్ డివిజన్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి**
**ఉప్పల్, అక్టోబర్ 1(తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ మరియు చిలకనగర్ డివిజన్‌లోని పలు కాలనీలలో బతుకమ్మ పండుగ వైభవంగా నిర్వహించబడింది. ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి ఈ కార్యక్రమాల్లో పాల్గొని పండుగను ఉత్సాహంగా చూసి, స్థానికులను శుభాకాంక్షలతోఆహ్వానించారు.ఉప్పల్ డివిజన్ న్యూ భరత్ నగర్ కాలనీ, హనుమాన్ నగర్, చిలకనగర్ డివిజన్ బ్యాంకు కాలనీల్లో మహిళలు, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సమక్షంలో పూలతో బతుకమ్మ పూజలు, సంబరాలు ఘనంగా జరిగింది.కాలనీలోని మహిళలు సంప్రదాయ బతుకమ్మను క్రీడలు, పాటలు, నృత్యాలతో జరుపుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయా లకు కీర్తిదీపంగా నిలిచే పండుగను పాఠంచేశారు. కార్యక్రమ నిర్వాహకు లు, స్థానికులు పండుగ వైభవాన్ని ప్రత్యేకంగా గుర్తించారు.




# వార్షికోత్సవం సందర్భంగా బ్లడ్ డొనేషన్ క్యాంప్

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 1, తెలంగాణ ముచ్చట్లు:**

ఖమ్మం నగరం లోని బీమా జువెల్లర్స్ నందు మొదటి వార్షికోత్సవం సందర్భంగా బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఖమ్మం వైద్య ఆరోగ్య శాఖ తరపున అధికారులు రాజశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ మోహన్ కృష్ణ మాట్లాడుతూ... తమ బీమా జ్యువెలర్స్ బ్రాంచ్ తరపున బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఏర్పాటు చేయడం పట్ల ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ప్రతి ఒక్కరు కూడా రక్తదానం చేయాలని, దానం చేసి ప్రాణదాతలు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ... బీమా జ్యువెలర్స్ రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం ఎంతో మంచి కార్యమని, ఇదేవిధంగా ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని అన్నారు. కార్యక్రమంలో బీమా జ్యువెలర్స్ డాన్స్ డిప్యూటీ మేనేజర్ లింగస్వామి, వెంకటరమణ, శివ, ఇతరులు పాల్గొన్నారు.

# "గాంధీ చూపిన బాటలో నడవాలి"

- **మాజీ ఎంపీ నామ**

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 1, తెలంగాణ ముచ్చట్లు;**



గాంధీ చూపిన బాటలో నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీఆర్ఎస్ పార్టీ మాజీ లోక్‌సభ పక్షనేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. అక్టోబర్ 2 మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆయన స్మరించుకుంటూ బుధవారం మీడియాకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అహింస, సత్యం, సహనం వంటి విలువలతో గాంధీజీ భారత స్వాతంత్ర్య పోరాటానికి మార్గనిర్దేశం చేశారనీ, అదే విలువలు నేటి సమాజానికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయని చెప్పారు. గాంధీజీ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమని పేర్కొంటూ, అణగారిన వర్గాలకు న్యాయం చేయాలన్నదే ఆయన ఆశయం అని గుర్తు చేశారు. శాంతి, అహింస, సత్యాగ్రహం వంటి పద్ధతుల్లో దేశ ప్రజలను నడిపిస్తూ మన దేశానికి స్వాతంత్ర్యం సాధించారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలోనూ గాంధీజీ ఆశయాలే బలంగా నిలిచాయని నామ గారు పేర్కొన్నారు. బిఆర్ఎస్ అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా గాంధీ బాటలోనే నడిచి తెలంగాణ కోసం దీర్ఘకాల పోరాటం చేశారన్నారు. కేసిఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆయన గ్రామ స్వరాజ్యం సాధన కోసం పని చేస్తూ, పల్లె ప్రగతి, గ్రామ పంచాయతీలుగా తండాల అభివృద్ధి వంటి చర్యల ద్వారా గాంధీ కలల్ని కార్యరూపంలోకి తీసుకొచ్చారని కొనియాడారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా నిలపగలిగిన ఘనత కేసీఆర్‌దేనని పేర్కొన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని మనమంతా గాంధీ ఆశయాలను సాధన దిశగా నడవాలన్నారు.



# దసరా నవరాత్రుల సందర్భంగా అమ్మవారి ప్రత్యేక పూజలు

**కాప్రా, అక్టోబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ నియోజకవర్గం, మీర్పేట్ హెచ్.బి. కాలనీ డివిజన్‌లోని మల్లాపూర్ అన్నపూర్ణ కాలనీ, ఎన్.టి.ఆర్ నగర్, బీహార్ సమాజ్ ప్రాంతాల్లో దసరా నవరాత్రుల సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అమ్మవారి మండపంలో విశిష్ట పూజలు ఘనంగా నిర్వహించబడ్డాయి.

ఈ ప్రత్యేక పూజల్లో బిజెపి డివిజన్ అధ్యక్షుడు రామ్ ప్రదీప్ మునుగంటి, డివిజన్ ప్రధాన కార్యదర్శి గోపు రాజేశ్వర్ పటేల్, సూరజ్ శేషరావు పాల్గొని భక్తులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక ప్రజలు, యువత, మహిళలు, కుటుంబ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక, సాంస్కృతికంగా ఉత్సాహభరితంగా పాల్గొన్నారు.పూజ కార్యక్రమంలో మంగళధ్వని, భజనలు, ప్రార్థనలు నిర్వహించడం వలన భక్తులలో ఆధ్యాత్మిక ఉత్సాహం మరింత పెరిగింది. కార్యక్రమం పూర్తయిన తర్వాత భక్తులకు పౌష్టిక భోజనం, ప్రసాదం పంపిణీ చేయబడింది.ఈ కార్యక్రమం స్థానిక కమ్యూనిటీ మరియు భక్తి సంఘాల మధ్య సామూహిక ఐక్యతను పెంపొందించడం మాత్రమే కాకుండా, ఉత్సవ సంస్కృతిని యువతలో కూడా కొనసాగించడంలో కీలక పాత్ర పోషించింది.

# ప్రజల అనుగ్రహమే నాయకుడికి నిజమైన శక్తి ఎం పి ఈటల రాజేందర్

**మేడ్చల్ మల్కాజ్గిరి, అక్టోబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు)**



మేడ్చల్ మల్కాజ్గిరి నియోజకవర్గం ఎంపీ ఈటెల రాజేందర్ ఈ దసరా సందర్భంలో ప్రత్యేక సందేశం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ, “మీరంతా అమ్మవారి అనుగ్రహం కోసం పూజలు చేస్తున్నారు. నాకు మాత్రం అమ్మవారి అనుగ్రహం మాత్రమే కాక, ప్రజల అనుగ్రహం కూడా అవసరం. నేను కాదు,మా ప్రజలు శక్తి వంతులు” అని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన భారతీయ సాంప్రదాయాలు, మహిళలకు ఇచ్చే గౌరవం, ధర్మంపై విశేషంగా వ్యాఖ్యానించారు. “మన సనాతన ధర్మం, ఆచార వ్యవహారాలు ఎంత గొప్పవో ఇప్పుడు ప్రపంచానికి అర్థమయ్యింది. మనలను అవుట్ డేటెడ్ ఉన్నవాళ్లే ఇప్పుడు మన సాంప్రదాయాలను చూసి గర్వపడుతున్నారు” అన్నారు.

ఎంపీ ఈటెల రాజేందర్ దసరాను అధర్మంపై ధర్మం, అన్యాయంపై న్యాయం, అసత్యంపై సత్యం విజయం సాధించిన రోజుగా గుర్తు చేశారు. అలాగే, బతుకమ్మ, గౌరమ్మ, బొడ్డెమ్మ పండుగలు, మహిషాసుర మర్ధిని పూజలలో మహిళలకు ఇచ్చే గౌరవం భారతీయ సాంప్రదాయాల ప్రత్యేకత అని తెలిపారు.140 కోట్ల ప్రజలున్న ఈ దేశంలో ప్రశాంతంగా ఉండటానికి కారణం భారతీయ సంస్కృతి, మహిళల పట్ల గౌరవమే అని పేర్కొని, తన నాయకత్వంలో ప్రజల భాగస్వామ్యాన్ని, శక్తిని గౌరవించే దృక్కోణాన్ని ప్రతిపాదించారు.

# ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచే నాయకుడు దామోదర్ రెడ్డి

- **మాజీ మంత్రి మృతికి మంత్రి పొంగులేటి సంతాపం**

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 1, తెలంగాణ ముచ్చట్లు:**

మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి మృతి పట్ల తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తీవ్ర సంతాపం తెలిపారు. ప్రజా ప్రతినిధిగా మాత్రమే కాకుండా, ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన నాయకుడని ఆయన అన్నారు. ఐటీ శాఖ మంత్రిగా దూరదృష్టితో పనిచేసి, తెలంగాణ సహా ఆంధ్రప్రదేశ్‌లో ఆ రంగ అభివృద్ధికి బలమైన పునాది వేశారని తెలిపారు. యువతకు అవకాశాలు కల్పించడంలో దామోదర్ రెడ్డి గారి పాత్ర స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ధైర్యం, రాజకీయ దూరదృష్టి, నిస్వార్థ సేవలు ఆయన రాజకీయ జీవనంలో ప్రధాన లక్షణాలు అని తెలిపారు. ప్రజలతో కలిసి మెలిసి జీవిస్తూ వారికోసమే పనిచేయడం ఆయన వ్యక్తిత్వానికి ప్రత్యేకత అని మంత్రి పొంగులేటి అభిప్రాయపడ్డారు. దామోదర్ రెడ్డి ఆకస్మిక మరణం కాంగ్రెస్‌కే కాకుండా తెలంగాణ రాజకీయాలకు కూడా భరించలేని లోటని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. ఆయన స్ఫూర్తిదాయకమైన జీవితం, ప్రజాసేవ పంథా భవిష్యత్ తరాలకు మార్గదర్శకమని అన్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ... ఈ క్లిష్ట సమయంలో భగవంతుడు వారికి ధైర్యం ప్రసాదించాలని కోరుకుంటున్నానని మంత్రి పొంగులేటి తెలిపారు.

# ధర్మవిజయానికి ప్రతీక విజయదశమి

- **ఖమ్మం ప్రజలకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు శుభాకాంక్షలు.**

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 1, తెలంగాణ ముచ్చట్లు;**



“ధర్మం అధర్మంపై గెలిచిన చారిత్రక ఘడియ... సత్యం అబద్ధాన్ని జయించిన పవిత్ర క్షణం...సమాజంలో మేలుకి మార్గం చూపిన శుభదినం – అదే విజయదశమి. ఈ మహత్తర పర్వదినం సందర్భంగా ఖమ్మం జిల్లా ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ, ధర్మబలం మన ప్రతి ఇంటిని కాపాడాలని ఆకాంక్షిస్తున్నాను” అని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

“విజయదశమి పండుగ మన భారతీయ సంస్కృతికి గర్వకారణం. రామచంద్రుడి బాణం రాక్షసత్వాన్ని నిర్మూలించినట్లే, మన జీవితాల్లోని చెడు, అబద్ధం, అన్యాయం తొలగిపోవాలని కోరుకుంటున్నాను. ధర్మాన్ని ఆశ్రయించినవారికి ఎప్పటికీ విజయం సొంతమవుతుందనే నమ్మకాన్ని ఈ పండుగ ప్రతి ఒక్కరికీ జ్ఞాపకం చేస్తుంది” అని తెలిపారు.

“దసరా పండుగ మనకు ఇచ్చే ప్రధాన బోధ ఏమిటంటే, ఎంతటి విఘ్నాలు ఎదురైనా సత్యాన్ని వదలకపోతే విజయం తప్పక దక్కుతుంది. దుర్గాదేవి శక్తి, రాముడి ధర్మబలం మనకు ఇచ్చే మార్గదర్శకం ఇదే. ఖమ్మం జిల్లా ప్రజలు ఐక్యతతో, ధైర్యసాహసాలతో ముందుకు సాగి అభివృద్ధి సాధించాలని మనసారా ఆకాంక్షిస్తున్నాను. ప్రజల శ్రేయస్సు కోసం బీజేపీ ఎల్లప్పుడూ అంకితభావంతో కృషి చేస్తుంది” అని నెల్లూరు కోటేశ్వరరావు స్పష్టం చేశారు.

“ఈ విజయదశమి పండుగ ప్రతి ఇంటిలో ఆనందం నింపాలి. సమాజంలో చెడు తుడిచిపెట్టుకొని మేలే నిలవాలి. శాంతి, సమృద్ధి, సౌఖ్యం ప్రతి కుటుంబంలో వెల్లివిరియాలి” అని ఆకాంక్షించారు.

ఖమ్మం ప్రజల ఐక్యత, శ్రేయస్సు, అభివృద్ధి కోసం విజయదశమి ఒక కొత్త ఆరంభమై నిలవాలని కోరుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు తన హృదయపూర్వక శుభాకాంక్షలను అందించారు.

# ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విజయదశమి శుభాకాంక్షలు

**కాప్రా, అక్టోబర్ 1(తెలంగాణ ముచ్చట్లు):**



ఉప్పల్ నియోజకవర్గ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, దసరా పండుగ జీవితానికి దిశానిర్దేశకమని చెప్పారు.ఎమెల్యే అన్నారు, “మనిషి తనలోని చెడుతో నిత్య పోరాటం చేసి మంచి లక్ష్యాలను సాధించాలనే జీవన తత్త్వం విజయదశమి పాఠం. పాలపిట్టను దర్శించడం, శమీ వృక్షానికి పూజ చేయడం, జమ్మి ఆకులను బంగారంలా పరిగణించి పెద్దలకు సమర్పించడం – ఇవన్నీ గొప్ప భారతీయ సాంస్కృతిక ఆచారాలు.”దసరా సందర్భంగా ప్రజలు పరస్పర ప్రేమాభిమానాలను పంచుకోవడం ద్వారా సామాజిక సామరస్యాన్ని పెంపొందిస్తారని, అలాగే వృత్తులకు సంబంధించిన పరికరాలు, వాహనాలను ఆయుధ పూజ చేసి గౌరవించడం కూడా దసరా ప్రత్యేకత అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

# అధర్మం పై ధర్మం విజయం ఘనంగా జరుపుకుంటున్న దసరా పండుగ

- **నవరాత్రి ముగింపు, విజయదశమి: సత్యానికి, ధర్మానికి నాంది**

**మేడ్చల్ మల్కాజిగిరి, అక్టోబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):**





హిందూ సంప్రదాయంలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన దసరా (విజయదశమి) పండుగను దేశ వ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నారు. తొమ్మిది రోజుల నవ రాత్రి ఉత్సవాలకు ముగింపు పలుకుతూ పదవ రోజు జరుపుకునే ఈ పండుగ, అధర్మం పై ధర్మం , అసత్యం పై సత్యం , గెలుపుకు ప్రతీకగా భావించబడుతుంది. పురాణాల ప్రకారం, ఈ రోజున శ్రీరాముడు రావణుడిని సంహరించి సత్యధర్మాలకు నాంది పలికాడు. అలాగే, దేవీ మహాత్మ్యం ప్రకారం మహిషాసురుడిని దుర్గాదేవి తొమ్మిది రోజుల యుద్ధం అనంతరం వధించింది. ఈ కారణంగానే ప్రజలు విజయదశమిని మహా పర్వదినంగా జరుపుకుంటారు.దసరా రోజున ఆయుధపూజ, వాహన పూజ, పుస్తకాల పూజలు నిర్వహించి భక్తులు శ్రద్ధతో ఆరాధిస్తారు. శమి చెట్టు ఆకులను బంగారం ప్రతీకగా పంచుకుంటారు. విద్యారంభం చేసేందుకు ఈ రోజు అత్యంత శుభప్రదమని భావిస్తారు. ప్రాంతీయంగా, మైసూర్ (కర్ణాటక) దసరా, అంబారీలో దుర్గాదేవి ఊరేగింపుతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. పశ్చిమ బెంగాల్‌లో దుర్గాపూజ దసరా పండుగ వైభవాన్ని సంతరించుకుంటుంది. తెలుగు రాష్ట్రాల్లో బతుకమ్మ పండుగ ముగిసిన తరువాత బొమ్మల కొలువు, శమి పూజ, వాహనపూజలు ప్రధానంగా నిర్వహిస్తారు.విజయదశమి పండుగ ధర్మం ఎప్పటికీ గెలుస్తుందని, సత్యం శాశ్వతమని గుర్తుచేస్తుంది. చెడును విడిచి మంచిని ఆచరించాలని, ప్రతి కొత్త ఆరంభం విజయవంతం కావాలని భక్తులు సంకల్పం చేస్తారు. దసరా శుభాకాంక్షలు!

# విజయదశమి శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపీ నామ

- **చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి - మాజీ ఎంపీ నామ**

**ఖమ్మం బ్యూరో, అక్టోబర్ 1, తెలంగాణ ముచ్చట్లు;**



విజయదశమి పర్వదినం పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పర్వదినం మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలలో విశిష్ట స్థానం కలిగి ఉందని చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకంగా మారాలని పేర్కొన్నారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. దసరా రోజు శుభసూచకంగా పాలపిట్టను దర్శించడం, శమీ వృక్షానికి పూజ చేయడం, జమ్మి ఆకును బంగారంలా భావించి పెద్దలకు సమర్పించి వారి ఆశీర్వాదం తీసుకోవడం వంటి సంప్రదాయాలను గుర్తు చేశారు. దసరా పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో ఒక ప్రత్యేక స్థానం ఉందని, అలాయ్ బలాయ్ వంటి సంప్రదాయాల ద్వారా పరస్పర ప్రేమాభిమానాలు పంచుకోవడం ద్వారా ప్రజల మధ్య సామాజిక సమరస్యం మరింత బలపడుతుందన్నారు. గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి దిశగా ముందుకు వెళ్లాలని కోరుకుంటూ, ఈ పండుగ ప్రతి ఒక్కరికీ విజయం, శుభఫలితాలను అందించాలని నామ ఆకాంక్షించారు.




# ప్రశాంత వాతావరణంలో దేవిశరనవరాత్రోత్సవాల నిమజ్జనం నిర్వహించుకోవాలి


- **వైరా సర్కిల్ ఇన్స్పెక్టర్: సాగర్**
- **నిర్వాహకులతో సమావేశం నిర్వహించిన: ఎస్ ఐ వీరేందర్**

**ఖమ్మం బ్యూరో,అక్టోబర్ 01 , తెలంగాణ ముచ్చట్లు:**

మండల కేంద్రంలో స్థానిక పోలీస్ స్టేషన్లలో ఎస్ ఐ వీరేందర్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో వైరా సి ఐ సాగర్ పాల్గొని మాట్లాడుతూ దేవీనవరాత్రి ఉత్సవాల ముగింపు నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని, డిజెలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిభందనలు ఉల్లంఘించరాదాని,చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చట్టరీత్యా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎస్ ఐ వీరేందర్ మాట్లాడుతూ రామక్రిష్ణపురం,అనంతసాగర్, పాతర్లపాడు గ్రామాలు పోలీస్ నిఘాలో ఉన్నాయని అలజడులు సృష్టిస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# మల్కాజిగిరి ఎమ్మెల్యే స్వచ్ఛంద రక్తదానంలో పాల్గొన్నారు

**మల్కాజిగిరి, అక్టోబర్ 1 (తెలంగాణ ముచ్చట్లు):** బోయినపల్లి క్యాంపు కార్యాలయంలో అరుంధతి ఆసుపత్రి సహకారంతో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు, సామాజిక కార్యకర్తలు కూడా హాజరై, ఎమ్మెల్యే రక్తదాన కార్యక్రమాన్ని ఆత్మీయంగా స్వీకరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, “ప్రతి మూడు నెలలకు ఒకసారి స్వచ్ఛంద రక్తదానం చేస్తూ ఉంటాను. రక్తదానం ద్వారా అనేక మంది రోగులకు జీవితాన్ని కాపాడే అవకాశం కలుగుతుంది” అని తెలిపారు. ఆయన రక్తదానం చేసే ప్రతి ప్రయత్నం స్థానికులకు ప్రేరణగా ఉండాలన్న ఉద్దేశంతో దీన్ని కొనసాగిస్తున్నారని చెప్పారు. అరుంధతి ఆసుపత్రి సిబ్బంది ఎమ్మెల్యేకు రక్త దానం ప్రక్రియలో సహకారం అందించి, రక్తం సురక్షితంగా సేకరించడం కోసం అన్ని సదుపాయాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులు, యువకులు రక్తదానంపై అవగాహన పెంచుకోవడంలో ఈ కార్యక్రమం తోడ్పడిందని అభిప్రాయపడ్డారు.



# సెప్టెంబర్‌లో 15 శాతం తగ్గిన ఆటో మొబైల్ సేల్స్..



సెప్టెంబర్‌లో రిటైల్ ఆటోమొబైల్ సేల్స్ దాదాపు 13శాతం పడిపోయాయి. పండుగ సీజన్‌కు ముందు నెలాఖరు నాటికి డిమాండ్ మొదలైంది. దాంతో ఆటో కంపెనీలకు ఊరట కలుగడంతో పాటు అక్టోబర్‌పై ఆశలను రేకెత్తించింది. వాహన్ పోర్టల్ డేటా ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నాటికి మొత్తం 1.51 మిలియన్ వాహనాలు నమోదయ్యాయి. గత సంవత్సరం ఇదే సమయంలో 1.74 మిలియన్ యూనిట్లతో పోలిస్తే ఇది 13.28 శాతం తగ్గింది. ఈ గణాంకాలు రిజిస్ట్రేషన్స్ మాత్రమే ప్రతిబింబిస్తాయని.. పూర్తి డెలివరీల వివరాలు కొద్దిరోజుల తర్వాత మాత్రమే తెలుస్తుందని ఆటో పరిశ్రమ నిపుణులు తెలిపారు. సెప్టెంబర్ తొలి మూడువారాల్లో కొనుగోళ్లు మందగించాయి.


పండుగ ఆఫర్లు, జీఎస్టీ రేట్లలో మార్పుల్లో స్పష్టత కోసం కొనుగోలుదారులు వాహనాలను కొనుగోలు చేయకుండా నిరీక్షించినట్లుగా పరిశ్రమ వర్గాలు తెలిపాయి. అదే సమయంలో పితృపక్షాలు సైతం షాపింగ్‌ను ప్రభావితం చేసిందని మార్కెట్ వర్గాలు తెలిపాయి. సెప్టెంబర్ 22న నవరాత్రుల ప్రారంభం నుంచే మార్కెట్‌లో సందడి కనిపించిందని.. జీఎస్టీ సంస్కరణలతో ధరలు సైతం తగ్గడంతో షోరూమ్స్ సందడిగా కనిపించినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. ముఖ్యంగా ప్యాసింజర్ కార్లు, ద్విచక్ర వాహనాల విభాగాల షోరూమ్‌ల్లో కస్టమర్ల రద్దీ, బుకింగ్‌లు, ఎక్వైరీలు పెరిగాయి. దేశంలో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి సెప్టెంబర్ 22 నుంచి 25 మధ్య కేవలం నాలుగు రోజుల్లో 75వేల వాహనాలను విక్రయించింది. మారుతి ఆగస్టు నెల మొత్తంలో సుమారు 1.35లక్షల యూనిట్లను విక్రయించింది. నెలాఖరు నాటికి డిమాండ్ ఎంత వేగంగా పెరిగిందో గణాంకాలు చెబుతున్నాయి. గత సంవత్సరం అక్టోబర్‌లో నవరాత్రి వేడుకలు ప్రారంభం కాగా.. పండుగల ప్రభావం సెప్టెంబర్‌లో కనిపించలేదు. ఈ సంవత్సరం సెప్టెంబర్ చివరి వారంలో డిమాండ్ కనిపించింది. ఇక రాబోయే నెలల్లో అమ్మకాలు జోరుగా సాగుతాయని ఆటోమొబైల్ ఇండస్ట్రీ భావిస్తున్నది. అక్టోబర్‌లో పండుగలు కొనసాగనున్నాయి. ఆ తర్వాత పెళ్లిళ్ల సీజన్ ప్రారంభమవుతుంది. పెట్రోల్ కార్లపై (1200సీసీ వరకు), డీజిల్ కార్లపై (1500 సీసీ వరకు) 18శాతానికి జీఎస్టీ తగ్గింది. అంతకంటే ఎక్కువ సీసీ కలిగిన వాహనాలపై 40శాతం.. ఇక ఎలక్ట్రికల్ వాహనాలపై కేవలం 5శాతం జీఎస్టీ పరిమితం చేయడంతో పరిశ్రమకు ఊతమిస్తుందని ఆటో ఇండస్ట్రీ భావిస్తున్నది.

# పండుగల వేళ పెరిగిన గ్యాస్ ధర..

**కమర్షియల్ సిలిండర్‌పై రూ.15.50 వడ్డన..!**




గ్యాస్ ధరలు వినియోగదారులకు షాక్ ఇచ్చాయి. పండుగ వేళ గ్యాస్ భారం స్వల్పంగా పెరిగింది. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల ధరలను పెంచినట్లు చమురు మార్కెటింగ్ కంపెనీలు తాజాగా ప్రకటించాయి. 19 కేజీల వాణిజ్య సిలిండర్ ధరను రూ.15.50 మేరకు పెంచినట్లు ప్రకటించాయి. దాంతో వాణిజ్య సిలిండర్ ధర రూ.1595.50కి పెరిగింది. కీలక పండుగలకు ముందు వాణిజ్య సిలిండర్ గ్యాస్‌పై ఎక్కువగా ఆధారపడే హోటల్స్, రెస్టారెంట్లతో పాటు పలు రంగాలను ప్రభావితం చేయనున్నది. సవరించిన రేట్ల ప్రకారం.. 19 కిలోల వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధరను రూ.15.50 పెరగ్గా.. ఢిల్లీలో, 19 కిలోల వాణిజ్య సిలిండర్ రూ.1,595.50 పెరిగింది. దేశ ఆర్థిక రాజధాని ముంబయి మహానగరంలో రూ.1,547, చెన్నైలో రూ.1,754, కోల్‌కతాలో రూ.1,700కి పెరిగింది. ఇక 14.2 కిలోల డొమెస్టిక్ సిలిండర్ ధరల్లో మాత్రం ఎలాంటి మార్పులు లేదు. దాంతో గృహ గ్యాస్ వినియోగదారులకు ఊరట లభించినట్లయ్యింది. ప్రస్తుతం డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ ధర ముంబయిలో రూ.852.50, ఢిల్లీలో రూ.853, చెన్నైలో రూ.868.50, కోల్‌కతాలో రూ.879, హైదరాబాద్‌లో రూ.925గా ఉన్నది. వాస్తవానికి వాణిజ్య అవసరాల కోసం వినియోగించే సిలిండర్‌ల ధరలను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రతి నెలా ఒకటో తేదీన మార్పులు చేస్తుంటాయి. అంతర్జాతీయ మార్కెట్లలో ఇంధన ధరలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ, ప్రభుత్వ విధానాలు, పన్ను విధానంలో మార్పులు, డిమాండ్ సరఫరాల్లో సీజనల్ మార్పులు, భౌగోళిక రాజకీయ అంశాలు, ఆయిల్ కంపెనీలు ఖర్చులు ఆదాయం తదితర అంశాల ఆధారంగా సిలిండర్ ధరల్లో మార్పులు చేస్తూ వస్తాయి. అయితే, మార్కెట్ ఒడిదుడుకుల ప్రభావం సామాన్యులపై పడకుండా ప్రభుత్వం గృహవినియోగ సిలిండర్ల ధరలను నియంత్రిస్తుంది. డొమెస్టిక్ గ్యాస్ ధరలను ప్రభుత్వం నియంత్రిస్తుండడంతో జనాలకు ఊరట కలుగుతున్నది. అయితే, వాణిజ్య సిలిండర్ల ధరలను మాత్రం ప్రతినెలా మారుతుంటాయి. ఒక్కో సందర్భంలో ధరలు తగ్గుతుంటాయి. అయితే, గత సెప్టెంబర్‌లో ధరలు పెరిగిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి ధరలు పెరగడంతో హోటల్స్, క్యాటరింగ్ సేవలు తదితర వాణిజ్య సంస్థలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుందని భావిస్తున్నారు. ఇవన్నీ రోజువారీ కార్యకలాపాల కోసం ఎల్‌పీజీపైనే ఆధారపడుతుంటాయి. సిలిండర్ ధర పెరగడంతో ఈ వ్యాపారాల నిర్వహణ ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. ఖర్చులను వినియోగదారుల నుంచి రాబట్టేందుకు ధరలను పెంచే అవకాశం ఉందని భావిస్తున్నారు.



## పండగ వేళ గుడ్‌న్యూస్ చెప్పనున్న కేంద్రం..

# ఉద్యోగులకు డీఏ పెంపు..?

పండగ వేళ కేంద్ర ప్రభుత్వంలోని ఉద్యోగులకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం శుభవార్త చెప్పనున్నట్లు తెలుస్తోంది. డియర్‌నెస్ అలవెన్స్ (కరవు భత్యం) సరవణ చేయనున్నట్లు తెలిసింది. నేడు ప్రధాని అధ్యక్షతన జరిగే సమావేశంలో కేంద్ర మంత్రివర్గం దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు తాజాగా తెలిపాయి. మంత్రివర్గం ఆమోదం తర్వాత సవరించిన డీఏ జులై 1 నుంచే అమల్లోకి రానుంది. ప్రభుత్వ నిర్ణయంతో దాదాపు కోటి మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఉపశమనం లభించనుంది. కంద్ర ప్రభుత్వం సాధారణంగా ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ పెంచుతుంది. ఇది జనవరి, జులైల్లో జరగాల్సి ఉన్నప్పటికీ ఏటా మార్చి, అక్టోబరులో ప్రకటిస్తూ వస్తోంది. ఆలస్యంగా ప్రకటించినా.. బకాయిలతో కలిపి జనవరి, జులై నుంచే చెల్లిస్తారు. ముఖ్యంగా డీఏ సవరణ కోసం ఆల్ ఇండియా కన్జూమర్ ప్రైస్ ఇండెక్స్ ఫర్ ఇండస్ట్రియల్ వర్కర్స్‌ను ప్రాతిపదికగా తీసుకుంటుంది. ఇదే ద్రవ్యోల్బణాన్ని అంచనా వేస్తుంది. ఈ ఏడాది మార్చిలో 2శాతం పెంచింది. దీంతో డియర్‌నెస్ అలవెన్స్ రేటు 53శాతం నుంచి 55శాతానికి పెరిగింది. ఇప్పుడు ఎంత మేర పెంచుతారన్నదానిపై క్లారిటీ లేదు. గతేడాది అక్టోబర్‌లో మాత్రం దీపావళి కానుకగా డీఏ 3 శాతం పెంచిన విషయం తెలిసిందే. కేంద్రం డీఏను సరవించిన నేపథ్యంలో రాష్ట్రాలు సైతం తమ ఉద్యోగులకు ఆ మేరకు డీఏ పెంచే అవకాశం ఉంటుంది.

# వడ్డీ రేట్లపై ఆర్బీఐ కీలక నిర్ణయం!

సామాన్యులకు మరోసారి ఆర్బీఐ గుడ్ న్యూస్ చెప్పింది. ఈరోజు జరిగిన సమావేశంలో వడ్డీ రేట్లపై కీలక నిర్ణయం తీసుకుంది. రెపో రేటు యథాతథంగా ఉంచుతూ ప్రజలకు తీపి కబురు అందించింది. కాగా రెపో రేటు 5.5 శాతం యథాతథంగా ఉండనుంది. అయితే ఆర్బీఐ రేపో రేటులను స్థిరంగా ఉంచడం ఇది రెండో సారి. అయితే.. తాజా ఆర్బీఐ ప్రకటనతో మనం కట్టే ఈఎంఐలలో ఎలాంటి మార్పులు ఉండవు.

ఇటీవల తగ్గింపు...

దేశ ఆర్థిక వ్యవస్థను బలపరిచే దిశగా ఆర్బీఐ అడుగులు వేస్తోంది. అయితే ఇటీవల అతర్జాతీయంతో పాటు మన దేశంలో నెలకొన్న కొన్ని పరిస్థితుల కారణాలతో ఈ సంవత్సరం ఫిబ్రవరి, ఏప్రిల్ లో జరిగిన సమావేశంలో రేపో రేట్లను 0.25 శాతం చొప్పున తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా.. జూన్ నెలలో నిర్వహించిన సమావేశంలో ఆర్బీఐ ఏకంగా 50 బేసిస్ పాయింట్లు తగ్గించింది. కాగా ఇలా వరుసగా మూడు కీలక సమావేశాల్లో ఆర్బీఐ.. రేపో రేటును 1 శాతం మేర తగ్గించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్ పై విధించిన పన్నుల భారం, అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో ఆగస్టు నెలలో రేపో రేటు మాత్రం యథాతథంగా 5.5 శాతం వద్దే ఉంచుతూ నిర్ణయం తీసుకుంది. అయితే అక్టోబర్ నెలలో కూడా రేపో రేటును యథాతథంగా ఉంచుతూ ప్రకటన విడుదల చేసింది.




# బంగారం ధర మరింత పెరిగింది..



బంగారం ధర రోజూ పెరుగుతూ సరికొత్త రికార్డులను నమోదు చేస్తోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారానికి డిమాండ్ పెరుగుతోంది . డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (అక్టోబర్ 1న) 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1, 17, 450కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. రూ. 1, 07, 660కి చేరింది . నిన్నటితో పోల్చుకుంటే దాదాపు వెయ్యి రూపాయల మేర బంగారం ధర పెరిగింది. ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములకు రూ. 1, 17, 600కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ ధర 10 గ్రాములకు రూ. 1, 07, 810కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 17, 450కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ. 1, 07, 660కి చేరింది (%Gశీశ్రీస జూతీఅషవ అఅ నవసవతీaపaస%). వెండి ధరలు నిన్నటితో పోల్చుకుంటే వంద రూపాయిల మేర పెరిగాయి. ఈ క్రమంలో దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న బంగారం, వెండి రేట్లను ఇప్పుడు తెలుసుకుందాం.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# బిర్యానీ ఆకుతో పొగ వేస్తే..!



చాలామంది ఇళ్లల్లో వాస్తు పరమైన దోషాలు కలిగి ఉండడం వల్ల,వారు రకరకాల సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది.ఇలాంటి సమస్యలతో బాధపడుతూ,వారి ఇంటి దోషాలను పోగొట్టుకోవాలని ఉన్నా కూడా నివారణ చర్యలకు చాలా మొత్తంగా ఖర్చుని వెనకాడుతూ ఉంటారు.కానీ వాస్తు పరమైన దోషాలకు బిర్యానీ ఆకు చాలా బాగా ఉపయోగపడుతుందని వాస్తు శాస్త్ర నిపుణులు చెబుతున్నారు.ప్రతి మంగళవారం కానీ,శుక్రవారం కానీ, శనివారం కానీ బిర్యానీ కాల్చి ఇల్లంతా పొగను చూపడం వల్ల ఇంటిలో ఉన్న నెగటివ్ అంతా వెళ్ళిపోయి,చాలా సమస్యలు వరకు తీరుతాయని సూచిస్తూ ఉన్నారు.

దాంపత్య సమస్యలు.. దాంపత్య జీవితంలో భార్యాభర్త అన్ని విధాలుగా అర్థం చేసుకుని సంతోషంగా ఉండాలని ప్రతి ఒక్కరు కోరుకుంటూ ఉంటారు. కానీ ఇంట్లో ఉన్న కొన్ని రకాల ప్రతికూల శక్తులు వారి మధ్య గొడవలు చికాకులు వచ్చేలా చేస్తూఉంటాయి.ఇటువంటి నెగటివ్ ఎనర్జీలు పోగొట్టుకోవాలంటే ప్రతి మంగళవారం మూడు బిర్యానీ ఆకులు తీసుకుని అందులో ఐదు కానీ ఏడు కానీ లవంగాలు ఉంచి ఇంటి చుట్టూ పొగ వేయడం వల్ల మంచి ఉపశమనం కలుగుతుంది.దీనితో భార్య భర్త మధ్య సక్యత కూడా ఏర్పడుతుంది.

సమయానికి డబ్బు లేని వారు.. కొంతమందికి ఎన్ని డబ్బులు వచ్చినా సరే ఏదైనా అవసరమున్నప్పుడు కచ్చితంగా చేతిలో రూపాయి కూడా మిగలకుండా పోతూ ఉంటుంది.అలాంటివారు ప్రతి శుక్రవారం ఐదు బిర్యానీ ఆకులు తీసుకుని, అందులో కర్పూరం చిటికెడు ఆవాలు వేసి,ఇల్లంత పొగ వేయడం వల్ల డబ్బు చికాకులు తొలగుతాయి.మరియు అనుకున్న సమయానికి సరైన మొత్తంలో ఏదో విధంగా డబ్బు అందుతుంది.

వ్యాపార సమస్యలు కలవారు.. వ్యాపారంలో లాభనష్టాలు సహజమే కానీ,కొంతమంది మాత్రం నష్టాలనే ఎక్కువగా చవిచూస్తూ ఉంటారు అలాంటి వారికి బిర్యానీ ఆకు చాలా బాగా ఉపయోగపడుతుంది.ఇందులో నుంచి వచ్చే మంచి ఆరోమా నెగటివ్ ఎనర్జీని పోగొట్టి, మనుషుల మెదడులో సరైన ఆలోచన కలిగేలా చేస్తుంది.దీనితో వ్యాపారవేత్తలు వ్యాపారంలో మెలకువలు పాటించి వ్యాపారాన్ని వృద్ధిలోకి తెస్తారు.ఈ బిర్యానీ ఆకుని కాల్చడం మాత్రం ప్రతి మంగళవారం రాత్రి సమయంలో చేయడం ఉత్తమం. మీరు కూడా ఇలాంటి సమస్యలతో బాధపడుతూ ఉంటే వెంటనే బిరియాని ఆకుతో ఈ నివారణను పాటించి మీ సమస్యలకు ఉపశమనం కలిగించుకోండి.

# టమాటా జ్యూస్‌ని డైలీ తాగితే..!



మనం నిత్యం వాడే కూరగాయల్లో టమాటాలు కూడా ఒకటి. టమాటాని కేవలం వంటల్లో మాత్రమే కాకుండా ఆరోగ్యాన్ని పెంచుకోవడానికి, అందాన్ని పెంచుకోవడానికి కూడా ఉపయోగించుకోవచ్చు.టమాటాలో పోషకాలు అనేవి పుష్కలంగా ఉంటాయి. నిత్యం టమాటా జ్యూస్ ని తాగితే బోలెడన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇమ్యూనిటీని బూస్ట్ చేస్తుంది: టమాటా జ్యూస్ లో లైకోపీన్, బీటా కెరోటిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి తీసుకోవడం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి అనేది పెరుగుతుంది. దీని వల్ల ముఖ్యంగా సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండొచ్చు. గుండె ఆరోగ్యాన్ని పెంచుతుంది: క్రమం తప్పకుండా టమాటా జ్యూస్ తాగడం వల్ల గుండె ఆరోగ్యం అనేది మెరుగుపడుతుంది. గుండె జబ్బులు రావడానికి చెడు కొలెస్ట్రాల్, హైపర్ టెన్షన్ ముఖ్య కారణాలు. వీటిని తగ్గించడంలో టమాటా జ్యూస్ సహాయ పడుతుంది. క్యాన్సర్ ముప్పును తగ్గిస్తుంది: టమాటా జ్యూస్ తరుచుగా తాగడం వల్ల రొమ్ము, ఊపిరి తిత్తులు, కడుపు క్యాన్సర్ రాకుండా చూస్తుంది. అంతే కాకుండా కాన్సర్ కణాలు అభివృద్ధి కాకుండా హెల్ప్ చేస్తుంది. చర్మం మెరుస్తుంది: టమాటా జ్యూస్ లో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ సి అనేవి మెండుగా ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ తో పోరాడి.. వృద్ధాప్య సంకేతాలను తగ్గిస్తుంది. అంతే కాకుండా చర్మాన్ని మెరిపించడంలో కూడా సహాయ పడుతుంది.

# రోగనిరోధక శక్తికి బలాన్నిచే ఆహారాలు..



సీజన్ మారేకొద్దీ జలుబు, దగ్గు వంటి సమస్యలు తలెత్తడం సర్వసాధారణం. చలికాలంలో జలుబు, ఫ్లూతో బాధపడుతున్నట్లయితే మీ రోగనిరోధక శక్తి బలహీనంగా ఉందని అర్థం. రోగనిరోధక శక్తి బలహీనంగా ఉన్న వారు మాత్రమే తరచుగా వ్యాధుల బారిన పడుతుంటారు. అందుకే ఈ కాలంలో ఆహారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. శరీరాన్ని లోపలి నుంచి వెచ్చగా ఉంచుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు రాకుండా నివారించుకోవచ్చు. చలికాలంలో శరీరం ఫిట్‌గా ఉండాలంటే పోషకాహారం తీసుకోవాలి. కాలానుగుణ ఆహారాన్ని తినడం వల్ల వ్యాధుల ప్రమాదాన్ని నివారించవచ్చు. ఫలితంగా శరీరాన్ని లోపలి నుంచి నుంచి వెచ్చగా ఉంచుకోవచ్చు. అటువంటి ఆహారాల్లో క్యారెట్లు ముందు వరుసలో ఉంటాయి. క్యారెట్లు ఏడాది పొడవునా లభిస్తుంటాయి. అయితే, శీతాకాలంలో తాజా క్యారెట్లను తినడం వల్ల అనేక వ్యాధుల నుంచి మిమ్మల్ని కాపాడుకోవచ్చు. క్యారెట్‌లో బీటా కెరోటిన్ ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. ఆహారంలో ఆవపిండిని తీసుకోవాలి. ఆవపిండిలో విటమిన్ ఎ, సి, కె ఉంటాయి. ఆవాల్లో ఫోలేట్, ఫైబర్ కూడా అధిక మొత్తంలో ఉంటుంది. చలికాలంలో ఈ కూరగాయలను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. ఈ సీజన్‌లో ఆవాలతో పాటు మెంతికూరను కూడా తినొచ్చు. మెంతికూరలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. మెంతుల పొడిని వివిధ వంటలలో కూడా ఉపయోగించవచ్చు. నువ్వులు శీతాకాలంలో తప్పనిసరిగా తినవల్సిన పదార్థం. వీటిల్లో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్లు, ఖనిజాలు ఉంటాయి. చలికాలంలో శరీరం వెచ్చగా ఉండాలంటే నువ్వుల లడ్డూ తినవచ్చు. శీతాకాలంలో పాలకూర తినాలి. పాలకూరను శీతాకాలపు సూపర్ ఫుడ్ అని కూడా అంటారు. పాలకూరలో ఐరన్, విటమిన్ ఎ, సి అధికంగా ఉంటాయి. ఇది శరీరాన్ని వెచ్చగా ఉంచడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచడంలోనూ సహాయపడుతుంది.



# ఎర్ర అరటిపండ్లు ఆరోగ్యానికి ఎంత మంచివంటే?

మనకు సంవత్సరమంతా ఎక్కువగా లభించే పండ్లల్లో అరటి పండు కూడా ఒకటి. అరటి పండును చాలా మంది కూడా చాలా ఇష్టంగా తింటారు. పైగా ఈ అరటిపండ్లు అందరికి అందుబాటు ధరల్లో లభిస్తూ ఉంటాయి.ఇంకా వీటిలో చాలా రకాలు ఉంటాయి. ఇక వాటిలో ఎర్ర అరటి పండ్లు కూడా ఒకటి. ఈ ఎర్ర అరటిపండ్ల పైతొక్క ఎర్రగా ఉంటుంది. పైగా ఈ అరటి పండ్లు కూడా చాలా రుచిగా ఉంటాయి. ఇతర అరటిపండ్ల లాగే ఎర్ర అరటిపండ్లు కూడా మన ఆరోగ్యానికి చాలా రకాలుగా మేలు చేస్తాయి. వీటిలో ఎన్నో పోషకాలు దాగి ఉన్నాయి.ఈ ఎర్ర అరటి పండ్లను క్రమం తప్పకుండా 21 రోజుల పాటు తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి చాలా మేలు కలుగుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఎర్ర అరటిపండ్లను ప్రతి రోజూ తీసుకోవడం వల్ల మనకు కలిగే ఆరోగ్య ప్రయోజనాలు గురించి ఇప్పుడు తెలుసుకుందాం. ప్రతి రోజూ ఎర్ర అరటిపండ్లను తీసుకోవడం వల్ల చర్మ ఆరోగ్యం బాగా మెరుగుపడుతుంది. దద్దుర్లు, దురద ఇంకా చర్మం పొడిగా మారడం వంటి లక్షణాలు తగ్గుతాయి. ఇంకా అలాగే ఎర్ర అరటిపండ్లను తీసుకోవడం వల్ల కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. కంటి సమస్యలు వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. ఇంకా అలాగే ఎర్ర అరటిపండ్లను తీసుకోవడం వల్ల సంతాన లేమి సమస్యలు తగ్గుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. నేటి కాలంలో చాలా మంది కూడా సంతానలేమి సమస్యలతో బాధపడుతున్నారు. ఇలాంటి వారు ఎర్ర అరటిపండ్లను ప్రతి రోజూ తీసుకోవడం వల్ల సంతానలేమి సమస్యలు తగ్గుతాయని త్వరగా సంతానం కలుగుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.ఇంకా అలాగే ఈ ఎర్ర అరటిపండ్లను తీసుకోవడం వల్ల నాడీ మండల వ్యవస్థ కూడా చాలా చురుకుగా పని చేస్తుంది. నరాల సంబంధిత సమస్యలు ఇంకా మూర్ఛ వంటి సమస్యలు తగ్గుతాయి. వీటిలో అధికంగా ఉండే యాంటీ ఆక్సిడెంట్లు నాడీ మండల వ్యవస్థను మెరుగుపరచడంలో బాగా సహాయపడతాయి. ఈ విధంగా ఎర్ర అరటిపండ్లు మన ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయని ఇతర అరటిపండ్లు లాగే వీటిని కూడా ఆహారంలో భాగంగా తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

# షుగర్ ఉన్నవారు చియా సీడ్స్ తీసుకుంటే ఏమి అవుతుందో తెలుసా?



డయాబెటిస్ ఉన్నవారు తీసుకొనే ఆహారం విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎందుకంటే డయాబెటిస్ నియంత్రణలో ఆహారం అనేది కీలకమైన పాత్రను పోషిస్తుంది.డయాబెటిస్ ఉన్నవారు చియా సీడ్స్ తీసుకుంటే ఏమి అవుతుందో తెలుసుకుందాం. ఒకప్పుడు చియా సీడ్స్ చాలా అరుదుగా లభించేవి. కానీ ప్రస్తుతం చాలా విరివిగా లభిస్తున్నాయి.అంతేకాకుండా మారిన జీవనశైలి పరిస్థితుల కారణంగా మనలో చాలా మంది చియా సీడ్స్ లో ఉన్న ప్రయోజనాల కారణంగా తీసుకోవటం ప్రారంభించారు. చియా సీడ్స్ లో డైటరీ ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. అందువల్ల రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. డయాబెటిస్ ఉన్నవారిలో అధిక బరువు సమస్య కూడా ఎక్కువగా ఉంటుంది. అటువంటి వారికి చియా సీడ్స్ బాగా సహాయపడతాయి. చియా సీడ్స్ తీసుకోవటం వలన కడుపు నిండిన భావన ఎక్కువసేపు ఉండి తినాలనే కోరిక కూడా ఉండదు. దాంతో బరువు తగ్గుతారు. ఈ గింజలు గ్లూటెన్ రహితంగా ఉంటాయి. ఈ గింజలలో యాంటీ ఆక్సిడెంట్లు, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, ఫైబర్ మరియు మెగ్నీషియం సమృద్ధిగా ఉండుట వలన డయాబెటిస్ సమస్యల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. చియా విత్తనాలు గ్లూకోజ్ మరియు ఇన్సులిన్ టాలరెన్స్‌ను మెరుగుపరచడంలో సహాయపడతాయి. చియా సీడ్స్ లో తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉంటుంది. డయాబెటిస్ ఉన్నవారిలో చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్ పెరుగుతూ ఉంటుంది. అలా కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్ పెరగకుండా చియా సీడ్స్ సహాయపడతాయి. అలాగే చియా విత్తనాలలో ఉండే యాంటీఆక్సిడెంట్ సమ్మేళనాలు ఫ్రీ రాడికల్స్‌ను తటస్థీకరించడంలో మరియు ఆక్సీకరణ ఒత్తిడిని నిరోధించడంలో సహాయపడతాయి. ఒక గ్లాస్ నీటిలో పావుస్పూన్ చియా సీడ్స్ వేసి మూడు గంటలు నానబెడితే గింజలు బాగా ఉబ్బి జెల్లీలా మారతాయి. వీటిని సలాడ్స్, మజ్జిగ వంటి వాటిలో కలుపుకొని తీసుకోవచ్చు.

## రాత్రి వేళ ప్రశాంతంగా నిద్రపోవాలంటే..!

**ఈ రోజుల్లో ప్రతి ఒక్కరు హెల్త్ కి తరువాత బ్యూటీ కి చాలా ఇంపారటన్స్ ఇవ్వడం సర్వ సాధారణం. ముఖ్యం గా ఫేస్ ని చాలా జాగ్రత్తగా కాపాడుకుంటారు. వీరి కోసమే ఈ చిన్న సలహా. సాధారణంగా ఇప్పుడు ఎవరి ఇంట్లో అయినా ఫ్రిజ్ ఉండటం కామన్. ఇప్పుడు అందరూ ఫ్రిజ్ వాటరే తాగుతున్నారు. ఇంట్లో ఏమి ఉన్నా లేక |షవ జబపవం:ఈ రోజుల్లో ప్రతి ఒక్కరు హెల్త్ కి తరువాత బ్యూటీ కి చాలా ఇంపారటన్స్ ఇవ్వడం సర్వ సాధారణం. ముఖ్యం గా ఫేస్ ని చాలా జాగ్రత్తగా కాపాడుకుంటారు. వీరి కోసమే ఈ చిన్న సలహా. సాధారణంగా ఇప్పుడు ఎవరి ఇంట్లో అయినా ఫ్రిజ్ ఉండటం కామన్. ఇప్పుడు అందరూ ఫ్రిజ్ వాటరే తాగుతున్నారు. ఇంట్లో ఏమి ఉన్నా లేక పోయినా ఐస్ వాటర్ లేదా ఐస్ క్యూబ్స్ అనేవి కామన్ గా ఉంటాయి. ముఖ్యంగా సమ్మర్ లో అయితే ఫ్రిజ్ వినియోగం మామూలుగా ఉండదు. ఎండ వేడిని భరించలేక కూలింగ్ వాటర్ తాగుతూ ఉంటారు. ఇక ఐస్ క్యూబ్స్ వంటి వాటిని జ్యూస్ లు వంటి వాటిల్లో ఎక్కువగా వినియోగిస్తారు. కానీ ఐస్ వాటర్ లేదా ఐస్ క్యూబ్స్ తో ఫేషియల్ చేసుకోవచ్చన్న విషయం చాలా తక్కువ మందికే తెలుసు. సెలబ్రిటీలు సైతం ఎక్కువగా ఈ ఐస్ ఫేషియల్ చేయించుసేందుకు ఇంట్రెస్ట్ చూపిస్తూ ఉంటారు. నిజానికి ఐస్ క్యూబ్స్ ఫేస్ కి చాలా మంచి చేస్తాయి. ఐస్ క్యూబ్స్**



**తో ఫేషియల్ ఎలా చేసుకోవాలో తెలుసుకోవాలి . ముందు ఒక పాత్ర నిండా ఐస్ వాటర్ ని తీసుకోవాలి. అందులోనే కొద్దిగా ఐస్ ముక్కలను కూడా వేయాలి. ఇప్పుడు ఆ పాత్రలో ముఖాన్ని అంతా ముంచాలి. నిజానికి అన్నీ రకాల చర్మాలు ఆ చల్లదనాన్ని తట్టుకోలేవు అలాంటి అప్పుడు కొన్ని ఐస్ ముక్కలను ఓ క్లాత్ లో చుట్టి ముఖంపై కాసేపు మర్దనా చేసుకోవాలి. దీన్నే ఐస్ ఫేషియల్ అంటారు. దీని వల్ల చాలా బెనిఫిట్స్ ఉన్నాయి. ఫేస్ ఫ్రెష్ గా అనిపిస్తుంది . మనకే ఒక్కసారి చేస్తే చేంజ్ అర్థం అయిపోతుంది. ఐస్ ముక్కలతో ఇలా చేయడం వల్ల వడ దెబ్బ అనేది తగ్గుతుంది. అలాగే ఐస్ క్యూబ్స్ తో మర్దనా చేసుకోవడం వల్ల శరీరంలో వచ్చే నొప్పి, మంట వంటివి తగ్గుతాయి. బ్లడ్ సర్క్యులేషన్ అనేది కూడా బాగా పెరుగుతుంది. దీని వల్ల ఫేస్ లో ఒకలాంటి గ్లో వస్తుంది.పింపుల్స్ తో బాధ పడేవారు సైతం ఐస్ ఫేషియల్ ను చేసుకోవచ్చు. దీని వల్ల మొటిమలు కూడా తగ్గే అవకాశం ఉంది.**

# చలికాలంలో చన్నీళ్ల స్నానం, వేడి నీటి స్నానం ఏది మంచిది?

చలికాలంలో దాదాపు అందరూ వేడినీటితో స్నానం చేయడానికి ఇష్టపడతారు. అయితే తీవ్రమైన చలికాలంలో కూడా కొందరు చల్లటి నీళ్లతో స్నానం చేస్తుంటారు. అయితే నిపుణుల అభిప్రాయం ప్రకారం..చలికాలంలో చల్లటి నీటితో స్నానం చేయడం వల్ల ప్రాణాంతక ఆరోగ్య సమస్యలు వస్తాయని హెచ్చరిస్తున్నారు. చల్లని వాతావరణంలో చల్లటి నీటితో స్నానం చేయడం వల్ల గుండెపోటు సంభవించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇది మరణానికి కూడా దారితీయవచ్చు. కాబట్టి చల్లటి నీళ్లకు బదులు గోరువెచ్చని నీళ్లలో స్నానం చేయడం మంచిది. చలికాలంలో చల్లటి నీరు శరీరంపై పోసుకోవడం వల్ల శరీరంలోని రక్తనాళాలు కుచించుకుపోతాయని సైన్స్ చెబుతోంది. ఇది రక్త ప్రసరణను కూడా నెమ్మదింపజేస్తుంది. వైద్యుల అభిప్రాయం ప్రకారం..చల్లటి నీటితో స్నానం చేయడం వల్ల హృదయ స్పందన అసాధారణంగా పెరుగుతుంది. ఇలాంటి సమయంలో గుండెలో బ్లాక్ ఏర్పడి హార్ట్ ఎటాక్ సంభవిస్తుందని అంటున్నారు. చలికాలంలోనే కాదు.. ఏకాలంలో అయినా గోరువెచ్చని నీళ్లతో స్నానం చేయాలి.

శరీర ఉష్ణోగ్రత, స్నానపు నీటి ఉష్ణోగ్రత మధ్య తేడా ఉండకూడదంటున్నారు నిపుణులు. ఇలా చేస్తే గుండె ఆరోగ్యంగా ఉంటుందట. స్నానం చేసే నీళ్లు మాత్రమే కాదు. శరీరాన్ని కూడా లోపలి నుంచి వెచ్చగా ఉంచుకోవాలి. చలికాలంలో వాకింగ్, రన్నింగ్ వంటి తేలికపాటి వ్యాయామాలు చేయడం వల్ల శరీరాన్ని ఫిట్‌గా ఉంచడంతోపాటు శరీరాన్ని లోపలి నుంచి వేడిగా ఉంచుతుంది. చక్కెర లేదా ప్రాసెస్ చేసిన ఆహారానికి బదులు ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినడానికి ప్రయత్నించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆకుపచ్చ కూరగాయలు అధిరంగా తినడానికి ప్రయత్నించాలి. ఇది చల్లగా లేదా వేడిగా ఆహారాలకు దూరంగా ఉండాలి. లేదంటే గుండెపోటు విషయంలో రెండు రెట్లు అధిక ముప్పు ఉంటుంది.



గురువారం-02- అక్టోబర్ 2025

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# వ్యక్తిత్వ వికాసంతోనే దేశ నిర్మాణం..

## అదే ఆర్ఎస్ఎస్ మార్గం: ప్రధాని మోదీ



రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అనేది కేవలం ఒక సంస్థ కాదని, వ్యక్తిత్వ వికాసం ద్వారా దేశ నిర్మాణానికి పాటుపడే ఒక మహోన్నత శక్తి అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. 'నేను' అనే అహాన్ని వీడి 'మనం' అనే సామూహిక భావన వైపు నడిపించే స్ఫూర్తిదాయక ప్రయాణమే సంఘ్ అని ఆయన అభివర్ణించారు. ఢిల్లీలోని డాక్టర్ అంబేద్కర్ అంతర్జాతీయ కేంద్రంలో బుధవారం జరిగిన ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్‌కు ఎన్నో అనుబంధ సంస్థలు ఉన్నప్పటికీ, వాటన్నింటి లక్ష్యం ఒకటేనని, అదే 'జాతికే ప్రథమ స్థానం' అని స్పష్టం చేశారు. ఏ రెండు అనుబంధ సంస్థల మధ్య వైరుధ్యాలు ఉండవని ఆయన పేర్కొన్నారు. సంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ హెడ్గేవార్ దేశ నిర్మాణం అనే బలమైన సంకల్పాన్ని తీసుకున్నారని మోదీ గుర్తుచేశారు. ప్రతి పౌరుడిలో దేశం పట్ల బాధ్యత పెరిగినప్పుడే దేశం బలోపేతం అవుతుందని ఆయన విశ్వసించారని తెలిపారు. అందుకే వ్యక్తి వికాసానికి ప్రాధాన్యత ఇచ్చారని వివరించారు. నేటికీ సంఘ్ శాఖల్లో ఈ వ్యక్తిత్వ నిర్మాణ ప్రక్రియ కనిపిస్తుందని, ఇవి శారీరక, మానసిక, సామాజిక ఎదుగుదలకు దోహదపడే పవిత్ర వేదికలని ప్రధాని అన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో డాక్టర్ హెడ్గేవార్ సహా ఎందరో సంఘ్ కార్యకర్తలు చురుగ్గా పాల్గొన్నారని మోదీ గుర్తు చేశారు. స్వాతంత్ర్యానంతరం కూడా సంఘ్ పై అనేక దాడులు, కుట్రలు జరిగాయని ఆయన అన్నారు. సంస్థను అణచివేసేందుకు అనేక ప్రయత్నాలు జరిగాయని, కానీ వాటన్నింటినీ సంఘ్ ఎదుర్కొని నిలబడిందని తెలిపారు. ఎన్ని కుట్రలు పన్నినా స్వయంసేవకులు ఎన్నడూ ద్వేషానికి ప్రాధాన్యత ఇవ్వలేదని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# మీరే పీఎం అయితే..

# ఒవైసీ ఆసక్తికర సమాధానం



**న్యూఢిల్లీ:** పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాక్‌కు గట్టి సమాధానం చెప్పేందుకు వచ్చిన అవకాశాన్ని భారత ప్రభుత్వం జారవిడుచుకుందని ఏఐఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. పాక్ ఉగ్రచర్యకు గట్టి ప్రతీకారం తీర్చుకోవాలనే సెంటిమెంట్ ప్రజల్లో బలంగా ఉందని, అయితే ఉగ్రదాడి అనంతరం చేపట్టిన మిలటరీ ఆపరేషన్‌ను ముగించడంతో మంచి అవకాశాన్ని కేంద్ర జారవిడుచుకుందని బుధవారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ ఉన్నారు. ఈ క్రమంలో ఊహాజనిత ప్రశ్న ఒకటి ఒవైసీకి ఎదురైంది.

**మీరే ప్రధాని అయితే..**

మీరే ప్రధాని అయి ఉంటే పహల్గాం ఉగ్రదాడి అనంతరం ఎలాంటి చర్య తీసుకునేవారని మీడియా అడిగిన ప్రశ్నకు ఒవైసీ సూటిగా స్పందించారు. 'వాస్తవానికి అనుగుణంగానే నేను వ్యవహరిస్తాను. మా లక్ష్యం కేవలం అధికారంలో కూర్చోవడం, మంత్రులు కావడం కాదు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం గట్టి సమాధానం చెప్పే మంచి అవకాశాన్ని మనం జారవిడుచుకున్నామని ఒక భారతీయుడిగా నేను గట్టిగా చెప్పగలను' అని అన్నారు.

**ఎందుకు ఆపేశారు?**

ఆపరేషన్ ఎందుకు ఆపేశారని ప్రశ్నించినప్పుడు... 'ఎందుకు ఆపేశారో నిజంగా నాకు తెలియదు. యుద్ధం తరహా పరిస్థితి నెలకొంది. అకస్మాత్తుగా ఆపరేషన్ ఆపేశారు. నేను చాలా ఆశ్చర్యానికి గురయ్యాను. యావద్దేశం నిర్ణయాత్మక స్పందన తెలియజేసేందుకు రెడీగా ఉంది. పాకిస్థాన్‌కు గుణపాఠం నేర్పాలని కోరుకుంది. మళ్లీ అలాంటి అవకాశం రాదు. ప్రభుత్వం మంచి అవకాశాన్ని వదులుకుంది. ఇప్పుడు కేవలం పార్లమెంటులో కూర్చుని, పీఓకేను ఎలా తిరిగి రాబట్టుకోవాలనే దానిపై మాట్లాడుకోవాలి' అని ఒవైసీ అన్నారు. కాగా, పహల్గాం ఉగ్రదాడికి స్పందనగానే ఆపరేషన్ సిందూర్ చేపట్టామని, తాత్కాలిక విరామం ఇచ్చినప్పటికీ ఆపరేషన్ సింధూర్ ఆగిపోయినట్టు కాదని, ఇది కొనసాగుతూనే ఉంటుందని ప్రభుత్వం ఇటీవల పలుమార్లు ప్రకటించించింది. 2025 ఏప్రిల్ 22న పహల్గాం దాడిలో 26 మంది టూరిస్టులను ఉగ్రవాదులు అమానుషంగా బలి తీసుకున్నారు. ఇందుకు ప్రతిగా 'ఆపరేషన్ సిందూర్'తో పాక్‌లోకి భారత బలగాలు దూసుకెళ్లి 9 ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేశాయి. 100 మందికి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టాయి. డ్రోన్లు, క్షిపణులతో జమ్మూకశ్మీర్‌లోని జనవాసాలు లక్ష్యంగా పాక్ దాడులకు పాల్పడగా భారత్ దీటుగా స్పందించింది. దీంతో పాక్ చేతులెత్తేసింది. కాల్పుల విరమణ ప్రతిపాదనతో ముందుకు రావడంతో భారత్ అంగీకరించింది.

# ఈ కేసులన్నీ ఒక్క రోజులో పోయేవే: మిథున్ రెడ్డి



ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్ట్ అయి, బెయిల్‌పై జైలు నుంచి విడుదలైన వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి అధికార కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తనపై పెట్టినవి అక్రమ కేసులని, వీటిని చూసి భయపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. జైల్లో తనను ఒక ఉగ్రవాదిలా చూశారని ఆవేదన వ్యక్తం చేసిన ఆయన, రాష్ట్రంలో మళ్లీ రాబోయేది జగనన్న ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. జైలు నుంచి బయటకు వచ్చిన అనంతరం మిథున్ రెడ్డి ఓ ఛానెల్‌తో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ''టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మమ్మల్ని వేధించడం, మాపై కేసులు పెట్టడం మామూలే. కేవలం మమ్మల్ని మానసికంగా ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతోనే ఈ అక్రమ కేసులు పెట్టారు. ఇలాంటి వాటికి భయపడతామని అనుకుంటే అది వారి భ్రమే అవుతుంది. ఇవన్నీ ఒక్కరోజులోనే వీగిపోయే కేసులు'' అని ఆయన కొట్టిపారేశారు. రెండున్నర నెలల పాటు జైలు జీవితం గడపాల్సి వచ్చిందని, అక్కడ తనను చాలా ఇబ్బందులకు గురి చేశారని మిథున్ రెడ్డి తెలిపారు. అయితే, తమ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి తనకు, తమ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా నిలిచారని పేర్కొన్నారు. ''మా అధినేత జగన్ మా వెంటే ఉన్నారు. మా కుటుంబానికి ఎవరికీ ఇవ్వని గుర్తింపు ఇచ్చారు. ఆయన కోసం, మళ్లీ జగనన్న ప్రభుత్వాన్ని తీసుకురావడం కోసం ఎన్ని కేసులైనా ఎదుర్కొంటాం, ఎన్ని ఇబ్బందులైనా భరిస్తాం'' అని ఆయన అన్నారు. కోర్టు ఆంక్షల కారణంగా కేసు గురించి ఎక్కువగా మాట్లాడలేనని, ఎన్ని కష్టాలు పెట్టినా అధైర్య పడేది లేదని ఆయన తేల్చిచెప్పారు.

# రగులుతున్న కరూర్..




- విమర్శలు, ప్రతివిమర్శలు
- అరెస్టులు, ఆగ్రహావేశాలు
- ఇంకా చల్లారని తొక్కిసలాట పర్యవసానం
- వాస్తవాలు తెలుసుకుందాం రండి: విజయ్‌కి బీజేపీ ఎంపీల బృందం ఆహ్వానం

ఇటీవల 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధినేత విజయ్ కరూర్ పర్యటన సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 41 మంది మృతి చెందగా, పలువురు గాయపడిన వ్యవహారం రాష్ట్రంలో ఇంకా నిప్పు రాజేస్తూనే వుంది. ఈ దుర్ఘటన ద్వారా లబ్ధి పొందేందుకు అన్ని పార్టీలు వ్యూహ, ప్రతివ్యూహాలు పన్నుతుండడంతో మరిన్ని కొత్త వివాదాలకు కారణమవుతోంది. ప్రభుత్వ నిర్లక్ష్యమే ఈ ఘటనకు కారణమని టీవీకే ఆరోపిస్తుండగా, ఆ పార్టీ ఉద్దేశపూర్వక ఆలస్యమే అసలు కారణమని అధికార పార్టీ ఆరోపిస్తుంది. దీంతో విమర్శలు, ప్రతివిమర్శలు, ఘటనకు కారణమైన వారుగా భావిస్తున్న వ్యక్తుల అరెస్టులు, దీనిపై ఆగ్రహావేశాలతో యావత్ రాష్ట్రం ఒకరకమైన ఉక్కపోతకు గురవుతోంది. మరోవైపు ఈ ఘటనపై నిజానిజాలు తెలుసుకునేందుకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఏర్పాటు చేసిన ఎనిమిదిమంది ఎంపీల బృందం మంగళవారం కరూర్ వెళ్లి క్షతగాత్రులను పరామర్శించి, మృతుల కుటుంబాలను ఓదార్చింది. ఈ మొత్తం వ్యవహారంలో ఎప్పుడు ఏ కొత్త విషయం వెలుగులోకి వస్తుందోన్న ఉత్కంఠ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. కరూర్ విషాద ఘటనకు సంబంధించి పోలీసులు అరెస్ట్ చేసిన టీవీకే కరూర్ పశ్చిమ జిల్లా కార్యదర్శి మదియళగన్, పౌన్‌రాజ్‌లకు 15 రోజుల పాటు రిమాండ్ విధిస్తూ కరూరు కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఈ వ్యవహారంలో ఏ పత్రాలనూ అంగీకరించలేమని, తన మనస్సాక్షి ఆధారంగా ఉత్తర్వులు జారీచేస్తున్నట్లు ఈ సందర్భంగా న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. కరూర్ ఘటనలో ముందస్తు బెయిలు కోరుతూ టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి నిర్మల్‌కుమార్ మద్రాసు హైకోర్టులో మంగళవారం పిటిషన్లు దాఖలుచేశారు. కరూర్ సభలో జరిగిన తొక్కిసలాట ఘటనకూ, తమకు ఎలాంటి సంబంధం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. అంతేగాక పోలీసుశాఖ తమ బాధ్యతలను పూర్తిగా విస్మరించిందని, ప్రభుత్వ యంత్రాంగం తప్పులు దాచిపెట్టి, తమపై కేసు నమోదు చేసిందని ఆరోపించారు.



## విరిగిపడిన ఆర్చ్ దిమ్మెలు..

# 9 మంది దుర్మరణం

- ఎన్నూర్ థర్మల్ విద్యుత్ కేంద్రం పనుల్లో ప్రమాదం
- మృతులంతా అసోం రాష్ట్ర వాసులు

**చెన్నై:** చెన్నై సమీపంలోని ఎన్నూర్ థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మాణ పనుల్లో ప్రమాదం సంభవించింది. నిర్మాణంలో ఉన్న ఆర్చ్ దిమ్మెలు విరిగిపడి తొమ్మిది మంది కార్మికులు దుర్మరణం చెందారు. మరో 10 మంది గాయపడ్డారు. బాధితులంతా అసోం రాష్ట్ర వాసులని పోలీసులు తెలిపారు. థర్మల్ విద్యుత్ కేంద్రంలో నాల్గవ యూనిట్ విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ పనుల్లో వెయ్యి మందికిపైగా కార్మికులు పాల్గొంటున్నారు. ఆర్చ్ నిర్మాణ పనుల్లో 30 మంది కార్మికులు ఉన్నారు. నిర్మాణంలో ఉన్న ఆర్చ్ దిమ్మెలు మంగళవారం సాయంత్రం హఠాత్తుగా కూలాయి. ఆ దిమ్మెలు 20 మంది కూలీలపై పడటంతో ఐదుగురు కార్మికులు అక్కడికక్కడే చనిపోయారు. గాయపడిన వారిని స్టాన్లీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరో నలుగురు చనిపోయారు. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఘటనా స్థలాన్ని విద్యుత్ శాఖ రాష్ట్ర కార్యదర్శి జె.రాధాకృష్ణన్, పోలీసు ఉన్నతాధికారులు పరిశీలించారు. జరిగిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతుల కుటుంబాలకు తమిళనాడు ప్రభుత్వం రూ.10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది.



# డిసెంబర్ 5-6 తేదీల్లో భారత్‌కు పుతిన్.. ప్రధాని మోదీతో భేటీ..!

రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్ త్వరలో భారత్‌లో పర్యటించనున్నారు. గతేడాది మాస్కో పర్యటన సందర్భంగా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు.. పుతిన్ భారత పర్యటనకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ఆయన ఇండియా టూర్ తేదీలు ఖరారైనట్లు తెలుస్తోంది. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఇటీవలే రష్యాలో పర్యటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పుతిన్ భారత పర్యటన తేదీలు ఖరారు చేస్తున్నట్లు అప్పట్లో ఆయన ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది డిసెంబర్ 56 తేదీల్లో పుతిన్ న్యూఢిల్లీలో పర్యటించనున్నట్లు తాజా సమాచారం. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై యుద్ధం అనంతరం ఆయన భారత్‌కు రావడం ఇదే తొలిసారి. ఈ పర్యటనలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో పుతిన్ భేటీ కానున్నారు. రష్యా చమురు కొనుగోలు చేస్తోందన్న కారణంతో భారత్‌పై అమెరికా భారీగా టారిఫ్‌లు విధించిన విషయం తెలిసిందే. ఈ టారిఫ్‌లతో అమెరికాభారత్ మధ్య దూరం పెరుగుతుండగా.. భారత్‌రష్యా మధ్య బంధం మరింత బలపడుతోంది. ఈ క్రమంలో పుతిన్ భారత్ పర్యటన ఆసక్తికరంగా మారింది.

# మధ్యప్రదేశ్‌లో ఘోరం..

## పసిపిల్లల ప్రాణం తీసిన దగ్గుమందు



**హైదరాబాద్:** మధ్యప్రదేశ్ లో పదిహేను రోజుల వ్యవధిలో ఆరుగురు పిల్లలు మరణించారు. అందరూ ఐదేళ్లలోపు చిన్నారులే.. కిడ్నీ ఫెయిల్యూర్ కారణంగానే వారంతా చనిపోవడంతో అప్రమత్తమైన వైద్యాధికారులు విచారణ చేపట్టారు. దగ్గు మందు వల్లే పిల్లల మరణాలు సంభవించాయని ప్రాథమికంగా తేలడంతో రెండు రకాల సిరప్ ల అమ్మకాలపై ప్రభుత్వం నిషేధం విధించింది. వివరాల్లోకి వెళితే.. ఛింద్వారా జిల్లాకు చెందిన ఓ కుటుంబంలో ఐదేళ్లలోపు బాలుడికి ఇటీవల జ్వరం వచ్చింది. చలిజ్వరంతో బాధపడుతున్న బాలుడిని తల్లిదండ్రులు స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లగా.. వైద్యుడు జ్వరం మందుతో పాటు దగ్గు మందు కూడా రాశాడు. ఆ మందులు వాడడంతో జ్వరం తగ్గింది. కానీ బాబుకు మూత్రం రావడంలేదు. వారంలోపే మళ్లీ జ్వరం తిరగబెట్టింది. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యుడు పెద్దాసుపత్రికి పంపించాడు. అక్కడ చికిత్స పొందుతూ బాబు చనిపోయాడు. మూత్రపిండాల ఇన్ ఫెక్షన్ కారణంగా బాబు చనిపోయాడని వైద్యులు తెలిపారు. అయితే, గతంలో తమ బాబుకు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని, జ్వరం, దగ్గు మందులు తాగించిన తర్వాతే మూత్రం పోయలేదని తల్లిదండ్రులు తెలిపారు. ఇవే లక్షణాలతో పదిహేను రోజుల వ్యవధిలో మరో ఐదుగురు పిల్లలు మృత్యువాత పడ్డారు. దీంతో ఛింద్వారా కలెక్టర్ స్పందించి రెండు రకాల దగ్గు మందులను అమ్మవద్దంటూ మెడికల్ షాపులకు ఆదేశాలు జారీ చేశారు. పిల్లల మరణాలపై విచారణ జరిపిస్తున్నట్లు ఆయన తెలిపారు.

# రక్షణరంగం అభివృద్ధికి వినూత్న వ్యవస్థ : రాజ్‌నాథ్ సింగ్



భారత రక్షణరంగంలో పరిశోధనను, అభివృద్ధిని బలోపేతం చేయడానికి వినూత్న వ్యవస్థను వృద్ధిచేస్తామని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. 'డిఫెన్స్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్ ల' 278వ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత యుద్ధాల్లో ఆధునిక సాంకేతికత బాగా పెరిగిందని, ఇది మనకు ఆందోళన కలిగించే విషయమని వ్యాఖ్యానించారు. కొత్తగా వస్తున్న సాంకేతికతలు ఏళ్లుగా జరిగిన పరిశోధన, అభివృద్ధి ఆధారంగా రూపొందించినవని రాజ్‌నాథ్ చెప్పారు. ఆ సాంకేతికతలను మనం కూడా అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మన చుట్టూ ఉన్న పరిస్థితులు మారిపోతున్నాయని, భద్రతా అవసరాలు పెరిగిపోయాయని వ్యాఖ్యానించారు. అందుకే రక్షణ బడ్జెట్ కూడా ఏటా పెరుగుతుందని అన్నారు. బడ్జెట్ పెరుగుదలతో దాన్ని తెలివిగా ఉపయోగించాల్సిన బాధ్యత రెట్టింపు అయ్యిందన్నారు. రక్షణరంగంలో సాంకేతిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రక్షణ మంత్రి చెప్పారు. మన సాంకేతిక వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు నిధులు పెంచుతున్నట్లు తెలిపారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in